# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 31 ISSUE 10
No. OF PAGES 40
JUNE 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ................................ ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగివేమన | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| అద్భుతమైన వధువు | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 15 |
| గర్భిణీ స్త్రీలకు శుభవార్త | 17 |
| పరిప్రశ్నేన సేవయా | 18 |
| పుట్టిల్లు | 19 |
| శ్రీచంద్రకాళీ విద్యానిధి | 20 |
| మౌన ధ్యాన సప్తాహ శిబిరం | 21 |
| శివానందలహరి | 23 |
| సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర | 26 |
| మధురాతి మధురం భగవన్నామం | 28 |
| అపరోక్షానుభూతి | 30 |
| నేను అర్థం చేసుకున్న జ్ఞానయోగం | 32 |
| తరణి | 34 |
| శ్రీరామ నవమి | 35 |
| శ్రేయోభిలాషి శ్రీబాబు | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

***కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంతం***
***అద్యైవమే విశతు మానస రాజహంస:***
***ప్రాణ ప్రయాణ సమయే కఫవాతపిత్తై:***
***కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే ॥***

కులశేఖరాళ్వారు మహారాజు అంతకన్నా మహాభక్తుడు. "ప్రాణ ప్రయాణ సమయంలో నా స్థితి ఎలా ఉంటుందో కఫవాత పిత్తములు కంఠమున గ్రమ్ముకొని నిన్ను స్మరింప శక్యమవుతుందో లేదో కృష్ణా ! నీ దివ్య పాదపద్మముల యందు నా మనస్సు నిపుడే లగ్నం చేయనీ" అని ప్రార్థించాడు మహాభక్తుడు.

అది యదార్థమే ఒక మహాభక్తుడు మరణ వేదనలో ఉన్నాడు. కఫాధిక్యంతో కంఠం అడ్డగించబడింది. డాక్టర్లు కఫాన్ని నివారించటం కష్టం, నివారించినా మరణం తథ్యం అని చెప్పారు. మరణం తథ్యమైనప్పుడు కఫాన్ని నివారించండి, భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ ప్రాణం విడుస్తాను అని డాక్టర్లని వేడుకున్న భక్తుని ఆవేదన వృథా పోతుందా?

జీవుడు ఆచరించిన కర్మమూ, ధర్మమే తన వెంట వచ్చేది. తక్కినది ఏదీ వెంట రాదు. అందువలననే శ్రీకృష్ణ పరమాత్ముడు **మయ్యర్పిత మనోబుద్ధి ర్మామే వైషస్స సంశయః** అన్నారు. మరణ సమయం అతి భయంకరమైనది. ఇంద్రియాలు పరవశమవుతాయి. బుద్ధి వికలమవుతుంది. చిత్తం స్వాధీనంలో ఉండదు. స్మృతి తప్పుతుంది. దైవస్మరణకి అనుకూలం కాదు.

మానవునికి జీవించటం ఎలాగో తెలుసు. కాని పునరపి జననం పునరపి మరణం అనే వలయాన్ని అధిగమించటానికి ప్రయత్నించడు. మహత్తరమైన మానవ జన్మ ఎత్తి భోగభాగ్యాలతో తులతూగి చివరికి యోగ్యమైన మరణాన్ని పొందలేక పోతున్నాడు. అందువలననే **తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ** అని అర్జునుని హెచ్చరించిన జగద్గురువు యొక్క హెచ్చరికను కర్మానుబద్ధులైన వారందరూ గుర్తించ దగినదే సుమా!

పరాశర ప్రసాద్
గౌరవ సంపాదకుడు

# యోగి వేమన

1. అజ్ఞానమె శూద్రత్వము
సుజ్ఞానము బ్రహ్మమౌట శ్రుతులను వినరా
అజ్ఞాన మడఁచి వాల్మికి
సుజ్ఞానపు బ్రహ్మమొందెఁ జూడర వేమా!

తాత్పర్యము – శూద్రుడని వేరే లేడు. అజ్ఞానియే శూద్రుడు. జ్ఞానమే పరబ్రహ్మమని వేదములు చెప్పుచున్నవి. వాల్మికి అజ్ఞానమును పోగొట్టుకుని బ్రహ్మస్వరూపమును పొందెను.

2. అడవి యడవి తిరిగి యాసను విడలేక
గాసిపడెడు వాఁడు ఘనుడు కాఁడు
రోసి రోసి మదిని రూఢిగా నిల్పిన
వాఁడె పరముఁగన్నవాఁడు వేమ.

తాత్పర్యము – ఆశను విడువలేక ఎన్ని అడవులు తిరిగి తపస్సు చేసినను గొప్పవాడు కాలేడు. మనస్సును నిశ్చలముగా ఉంచుకొన్నవాడే ముక్తిని పొందును.

3. అదిమి మనసు నిలిపి యానందకేళిలో
బ్రహ్మమయుఁడు ముక్తిఁ బడయఁగోరు
జిహ్వారుచులచేత జీవుండు చెడునయా
విశ్వదాభిరామ వినురవేమ.

తాత్పర్యము – సమస్తము నిచ్చునట్టి దేవునకు ఇష్టుడవైన ఓ వేమన్నా! బుద్ధిమంతుడు తన మనస్సును అరికట్టి ముక్తిని పొంద యత్నించును. మూర్ఖుడు జిహ్వాచాపల్యము వలన మనస్సును నిలుపక చెడును.

# శ్రీబాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

మానవుడి స్వగృహం భగవంతుడి నిలయం. మనమందరం మన మన పనులు నిర్వర్తించుకోవటానికి ఆయనను విడచి వచ్చాం. ఈ ప్రపంచంలో మన ఉనికి తాత్కాలికం. మళ్ళీ మనం మనకు స్వస్థానమైన పరమాత్ముడిని చేరుకుంటేనే మనకు తృప్తి, మనశ్శాంతి.



చంచలమైన మానవుడి మనస్సు భౌతిక విషయాలనే సుడిగుండంలో చిక్కుకుని భగవంతుడికి దూరంగా కొట్టుకుపోతుంది. ఎప్పుడైతే భగవంతుడికి దూరమైనామో అప్పుడు స్వార్థం, సంకుచితత్వం, ద్వేషం మొదలైన నీచగుణాలు మనను ఆక్రమిస్తున్నాయి. దాని ఫలితంగానే మన మనస్సులు క్రుళ్ళి దుర్గంధ భూయిష్ఠాలవుతాయి. ఇదే మన పతనానికి హేతువు.

పారిశ్రామిక రంగంలో ప్రముఖుడైన ఒక సంపన్నుణ్ణి వుదాహరణగా తీసుకుందాం. ఆయన కోట్ల కొలది ఖర్చుచేసి ఒక పెద్ద పరిశ్రమను స్థాపించారు. అది అనేకవేల మందికి జీవనాధారమైంది. అక్కడ తయారయ్యే వస్తువు చాలా ఉపయోగకరమైనది కావటం వల్ల, దానికి యీ దేశంలోనే కాక, విదేశాలలో కూడా మంచి గిరాకీ ఏర్పడింది. అలాటి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ఆ యజమాని, ఆ కార్మికులు, ఆ రాష్ట్రం, ఆ దేశం సుఖశాంతులతో వర్ధిల్లాలంటే, ఆ పవిత్ర కృషినే యోగసాధనగా మలచుకుని వారందరూ కర్మయోగులై తరించాలంటే, ఆ పరిశ్రమ యెడల వారు ఎలాంటి దృక్పథం అలవరచుకోవాలి?

ఒక మామిడి పండు టెంకను నాటామనుకోండి. ఆ చెట్టు విరగ కాయాలని మనమంతా ఆ ఫలాలను మనసుతీరా తినాలనీ ఆశిస్తాం. అప్పుడేం చేయాలి? ఆ మొలిచే మొక్కకు చక్కని పాదు చేసి, రోజూ నీళ్ళుపోసి, తగినంత ఎరువు వేసి, కలుపు తీసి, చీడ పట్టకుండా

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంతమాత్రం మనం శ్రద్ధ తీసుకుంటే చాలు. మానుకట్టమనీ, కొమ్మలూ రెమ్మలూ పెరగనివ్వమనీ మనం అడగనక్కర్లేదు. ఆ విషయమంతా భగవానుడే చూసుకుంటాడు. త్వరలోనే ఆ మొలక మహావృక్షమవుతుంది. ఆ చుట్టు ప్రక్కల ఉన్న వాళ్ళందరికీ చల్లని గాలినీ, నీడనూ యిస్తుంది. ఆ ప్రదేశానికి చక్కని అందాన్ని యిచ్చి ఆనందాన్ని కలుగజేస్తుంది. దానిని నాటిన యజమానికేగాక ఆ ప్రాంతానికీ, దేశానికీ, విదేశాలకూ కూడ పంపటానికి తగినన్ని ఫలాలను ప్రసాదించి మాధుర్యాన్ని పంచిపెడుతుంది. ఇదంతా కూడా ఆ వృక్షం ప్రతిఫలాపేక్ష లేకుండా చేస్తుంది. ఆ వృక్షాన్ని చూసి ఎలా ప్రవర్తించాలో మనం నేర్చుకోవచ్చు.

అయితే మొక్కగా ఉన్నప్పుడు నీరు పోయకపోయినా, తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినా ఆ యజమానికేకాక, యావద్దేశానికీ ఎంతో నష్టం కదా!

మనం యింతకు ముందు మాట్లాడుతూన్న పారిశ్రామికవేత్త స్థాపించిన పరిశ్రమను యీ మామిడిచెట్టుతో పోల్చి చూద్దాం. పరిశ్రమ ప్రాథమిక స్థాయిలోనే యజమానీ, కార్మికులు చక్కగా శ్రద్ధ తీసుకుంటే ఆ పరిశ్రమ దినదినాభి వృద్ధి చెంది మొత్తం దేశపు ఆర్థిక వ్యవస్థకే చేయూతనిస్తుంది. విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతుంది. బీదలను భాగ్యవంతులుగా, భాగ్యవంతులను కోటీశ్వరులుగా మారుస్తుంది. ఋణగ్రహీతలను ఋణదాతలుగా మారుస్తుంది.

అదే పరిశ్రమ యజమానీ, కార్మికులూ శ్రద్ధాళువులు కాకపోతే, యజమానిని దివాలా తీయించి, కార్మికులను నిరుద్యోగులుగా చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను కృంగదీస్తుంది. సర్వనాశనానికి నాందీవాచకం పలుకుతుంది.

ఆ పరిశ్రమ యజమాని తనకూ, తన కార్మికులకూ క్షేమం కోరిన వాడైతే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

-సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీ మాతాజీ అభిభాషణ

–జపమాల ప్రసాద

(13.2.2004 - శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయం పాలకొల్లు - ప॥గో॥ జిల్లా)

"ఈరోజు శ్రీనాగభూషణంగారు, శ్రీమామిళ్ళయ్య గారు ఈ సత్సంగ సమావేశములను యిక్కడ ఏర్పాటు చేశారు. భగవంతుడు ప్రతిపనికీ ఒక నిర్ణయ కాలాన్ని నియమించే వుంటాడు. పైపైన ఎందరిపేర్లు మనం చెప్పుకున్నా, లోపల నుండి ప్రేరణ చేసే శక్తి మాత్రం ఒక్కటే. '**'ధియో యోనః ప్రచోదయాత్'**' అని గాయత్రీ మంత్రం చెబుతున్నది. మనలోనే వుండి మనబుద్ధిని ప్రచోదన చేస్తున్న శక్తి ఒకటి వుంది. ఇక్కడ యిన్ని మైకులు, స్పీకర్లు యివన్నీ పనిచేస్తున్నాయి అంటే వాటిలో అంతర్లీనంగా వున్న కరెంటు వల్లనే. అదే విధంగా, భగవంతుడు సృష్టిలోని ప్రతి అణువులోనూ నిండి వుండి, అన్నింటినీ ప్రకాశింప చేయడమే కాక ఆ అనంత శక్తిని తెలుసుకునే శక్తిని మనకి ప్రసాదిస్తున్నాడు.



అభిషేకానికి ముందు మహాన్యాసం చెప్పుకున్నట్టుగా, మహాశివరాత్రి ముందు శ్రీస్వామి వారి సేవచేసుకునే మహద్భాగ్యం, నాకు లభించింది. **'నా రుద్రో రుద్ర మర్చయేత్'** అంటే రుద్రుడు కానివాడు రుద్రుని అర్చించకూడదు అని అర్థం. అంతటా ఆవరించి వున్న రుద్రుడు నాయీ మనస్సు సకలేంద్రియాలు, అంగాంగాలలోను, సకల దిక్కులందును, అదీ, ఇదీ అననేల, సర్వేసర్వత్రా ఆ రుద్రుడే వ్యాపించి వున్నాడని, ఆయనకి నమస్కరించి, అభిషేకం చేసే మనము కూడా రుద్ర స్వరూపమేనని గుర్తించడమే మనం 'మహన్యాసం'లో చేస్తున్న క్రియకి అర్థం. పురోహితుడు చెప్పినట్టు చేతులు త్రిప్పేస్తారుగానీ, మనసు మాత్రం తమ దగ్గరే వుంచుకుంటున్నారు. అలా చేయకూడదు. ఆ స్వామివారి దివ్య సన్నిధిలో, ఆ స్వామివారిని తెలుసుకునే శక్తినిచ్చే సద్గురుదేవుల సమక్షంలో, ఇంతమంది భక్తుల మధ్య మనం సత్సంగం చేసుకుంటున్నామంటే అసలు ఒళ్ళు తెలుస్తుందా?

దేహము సజీవమై ఉండగానే దానిలోని దివ్యత్వాన్ని తెలుసుకోవాలి. దేహంమీదే దృష్టి వుంచుకుంటే విషయాలు మనని కృంగ దీస్తాయి. మార్పులేని

వస్తువుని గురించి తెలుసుకుందామని సత్సంగానికి వచ్చి కూర్చున్నాం. పరమశివుడి దర్శనం చేసుకుని వచ్చాం. ఆ ముద్ర మనలోంచి చెరపబడుతుందా? ఆసక్తి, ఆవేదన వుండాలేగానీ, ఆ గురుస్వరూపాన్ని ఎంత ఆస్వాదిస్తే తనివి తీరగలదు? ఆస్వాదించేది మనమే. బెల్లం యొక్క తీపిని చూపించగలమా? తిన్నవాడి ముఖం చెప్తుంది గాని. అలాగే భగవదనుభూతి కూడా అనుభవించి తీరాలి. అది ఏ ఒక్కరికో, ఏఒక్క స్థలానికో స్వంతం కాదు. అది ధర్మస్వరూపం. అది అందరి సొత్తు. స్వధర్మాన్ని 'సు'ధర్మంగా (ఆత్మ ధర్మంగా) ఆచరించిన వారి సొత్తు.

అలాగ స్వధర్మాన్ని సుధర్మంగా ఆచరించిన రాజయోగి జనకమహారాజు. ఆయన తన రాజ్యాన్ని , దారాపుత్రాదులని విడిచిపెట్టలేదు. అన్నిటి మధ్యా వుంటూనే తన 'సుధర్మంలో' వున్న మహాజ్ఞాని జనకుడు. సుధర్మం అంటే ఆత్మ ధర్మమే. అస్మద్గురు దేవులు శ్రీబాబూజీమహారాజ్ "నీ దారాపుత్రాదులని విడిచిపెట్టనవసరంలేదు. నీ స్వధర్మాన్ని ఆచరిస్తూనే మనస్సుని భగవంతుని యందు నిలుపు. దానినే రాజయోగమంటారు" అని చెప్పేవారు. ప్రొద్దుట తిన్న ఇడ్లీ సాంబారు వాసనే చేతులని వదలదే, మరి జన్మాంతర వాసనలెలా వదులుతాయి? ఉన్నదాన్ని ఉన్నట్టుగా అనుభవించాలంటే నువ్వు కొన్నింటిని వదిలి పెట్టి తీరాలి. జన్మాంతరాల వాసనలు మనని పట్టి వదలటం లేదు. అభిషేకం చేసుకోవాలి, శాంతిని పొందాలి అని అనుకుంటున్నావు. అభిషేకం అయ్యేంతవరకేనా నీ శాంతి? గుడిదాటి బయటికి కాలుపెట్టిన మరుక్షణం నుంచి మళ్ళీ మనస్సు ప్రాపంచిక విషయాలచుట్టూ తిరుగుతూనే వుంటుంది. 'ఇది శివాలయం - ఇది పంచారామాలలో ఒకటి. ఇది నా ఇల్లు' అని ఈ విధంగా వీటన్నింటినీ గుర్తింపచేసే వాడు మనలోనే వున్నాడు. ఇది ఎంత ప్రసిద్ధికెక్కిన క్షేత్రమైనా, మళ్ళీ మనింటికి మనం వెళ్ళిపోవాలనే ఆత్రుత చెందుతున్నాం.

అదే విధంగా, ఈ దేహమే మనకొక అద్దెకొంప. మన నిజమైన స్వంత ఇంటికి వెళ్ళడానికి మనం ఆత్రుత చెందాలి. మన స్వంత ఇల్లు, స్వస్థానం ఆ పరమాత్మే - అదే ఆత్మ. దేనికోసం కృషి చేయాలన్నా మన దేహం మనకి అవసరం. దానిని భగవంతుడ్ని తెలుసుకోడానికి వినియోగిస్తే దేవాలయమవుతున్నది. ప్రపంచ విషయాలకోసమే వినియోగిస్తే, దుఃఖాలయమవుతోంది.

– సశేషం

(గతసంచిక తరువాయి)

# సన్నిధిలో సంభాషణ

-పరాశర ప్రసాద్

17-6-1985

ఈ రోజు శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మానవుడు తనలోని మాయాశక్తి అనే రాక్షసుణ్ణి జయించాలంటే ఆధ్యాత్మిక జిజ్ఞాస ఉండాలి. ఆధ్యాత్మిక దృష్టి కలగటానికి సద్గురుమూర్తి ప్రబోధాన్ని వినాలి. ఆయన కృపని పొంద గలగాలి. అటువంటి మానవుడు సంసారంలో ఎటువంటి సుడిగుండాలనైనా ఎదుర్కోన గలుగుతాడు. గురుకృప రెండు వైపులా పదును కలిగిన కత్తి వంటిది. ఇహంలోనూ పరంలోనూ విజయాన్ని పొందగలవు. ఎవరైతే గురుబోధని శ్రద్ధగా విని మననం చేసుకుని విచారణ చేసి అనుభవానికి తెచ్చుకుంటారో, అలా చేసినవాడి మలిన మనస్సు శుద్ధ మనస్సుగా మారుతుంది. మలిన భావాలకు స్థానముండదు" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "రాక్షస ప్రవృత్తి కూడా పరమాత్ముని అనుగ్రహం ఉంటే ఎలా నిర్వీర్యమవుతుందో మీకొక ఉదంతం చెబుతాను. ఒకనాడు ఒక మహారాజు సామంతులతో, మంత్రులతో, ప్రజలతో కలిసి సభ తీర్చి ఉన్నాడు. దేశ పరిస్థితులను గురించి చర్చిస్తున్నాడు. ఆ మహారాజు మంత్రులూ కూడా ఆధ్యాత్మిక చింతన కలిగినవారు. అనుకోకుండా ఆ సభలోనికి మూడు పుర్రెలతో ఒక రాక్షసుడు 'హర! హర!' అంటూ ప్రవేశించాడు. ఆ రాక్షసుణ్ణి చూసి సభలోని వారంతా భయపడిపోయారు.

ఆ రాక్షసుడు మాట్లాడుతూ 'మీరు భయపడవలసిన పని లేదు.నేను నా వెంట మూడు పుర్రెలు తీసుకువచ్చాను. మానవులు ఎంతో వివేకవంతులు ఆలోచనాశక్తి కలవారు. వారికి మంచి చెడు విచారణ చేయడానికి బుద్ధి ఇంద్రియము ఉంది కదా! మీ ఆలోచనా శక్తిని ఉపయోగించి నేను తెచ్చిన మూడు పుర్రెల విశేషాన్ని చెప్పగలిగితే మీకు ఏ రకమైన అపకారం చేయను. కాని నేను అడిగిన దానికి సమాధానం చెప్పలేకపోతే మిమ్మల్నందరినీ అప్పడం లాగా నమిలి వేస్తాను' అన్నాడు రాక్షసుడు.

మహారాజు రాక్షసుణ్ణి కూర్చోమన్నాడు. నేను వీటి మీద కూర్చుంటే అవి విరిగిపోతాయి అన్నాడు రాక్షసుడు. మహారాజుగారు మంత్రి వంక చూశారు. మంత్రి మేధాశక్తి కలవాడు. అంతేకాక ఆ రాక్షసుణ్ణి సమాధానం చెప్పటానికి కొంత వ్యవధి ఇమ్మని అడిగాడు. సరే అన్నాడు రాక్షసుడు.

మంత్రి కొద్దిసేపు కళ్ళు మూసుకుని గురుదేవుణ్ణి ప్రార్థించాడు. గురుశక్తి ఆయన బుద్ధి ఇంద్రియానికి సమాధానాన్ని అందించింది. మంత్రివర్యులు వెంటనే రాజభటులను పిలిచి ఒక ఇనుప ఊచ తీసుకుని రమ్మని ఆజ్ఞాపించాడు.

మంత్రి ఊచని చేతిలోకి తీసుకున్నాడు. ఊచని ఒక చెవిలో పొడిచాడు, అది రెండవ చెవిలో నుంచి బయటకు వచ్చింది. వెంటనే మంత్రి చెప్పటం మొదలుపెట్టాడు మహారాజా! వీడు అధముడు. వీడి చరిత్ర ఏమిటంటే వీడు జ్ఞానబోధను ఒక చెవితో విని రెండవ చెవితో బయటకు వదులుతాడు అన్నాడు.

మంత్రి రెండవ పుర్రెను తీసికొన్నాడు. ఊచని చెవిలో పొడిచేసరికి నోటిలో నుంచి బయటకు వచ్చింది. మంత్రిగారు మాట్లాడుతూ వీడు మధ్యముడు. వీడు జ్ఞానబోధని వింటాడు. విన్న దానిని పదిమందికి చెప్పి ఆనందిస్తాడు. అక్కడితో సరి. లోపల మాత్రం ఏమీ మిగలదు అన్నాడు.

అదే విధంగా మూడవ పుర్రె చెవిలో ఇనప ఊచ పొడిచేసరికి అది హృదయంలోకి వెళ్ళింది. మహారాజా! ఇతడు ఉత్తముడు. మహాత్ముల జ్ఞానబోధ విన్న తరువాత దానిని హృదయంలో నిలుపుకుని మననం చేసి అనుభవంలోకి తెచ్చుకుంటాడు. తప్పక కృతార్థుడు అయ్యాడు. జన్మని సార్థకం చేసుకున్నాడు అన్నాడు.

మంత్రిగారి వ్యాఖ్యానం విన్న రాక్షసుడు మాట్లాడుతూ 'శభాష్! ఆధ్యాత్మిక చింతన గల మీ రాజ్యంలో రాక్షసులకు స్థానం లేదు' అని రాక్షసుడు వెళ్ళిపోతాడు. చూశారా! పరమాత్మ శక్తిని నమ్ముకుంటే ఎలా రక్షణ జరుగుతుందో!" అన్నారు శ్రీబాబు. *

---

చాకలిది దుఃఖంగా విచారంగా ఉంది. 'ఏమిటి కారణం?' అన్న రాణీగారితో '**మా మల్లన్న చచ్చిపోయాడు**' అన్నది.

సానుభూతిగా రాణీగారు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. వారిని చూసి దాసీలు, అంతఃపురం అంతా రాణిగారి పుట్టింటివారు పోయారేమో అనుకుని, రాజుగారు – వారిని చూసి మంత్రులు, తదితరులుకళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

విచారించగా విచారించగా దుఃఖానికి కారణం – చాకలిదాని గాడిదకు మూడు రోజుల క్రితం పుట్టిన '**మల్లన్న**' అనే ***గాడిద పిల్ల*** మరణం!!

మూఢత్వంగా చేసే అభ్యాసం కంటె జ్ఞానం మేలు

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జూన్ 2012**

**2 శని** శని త్రయోదశి

**4 సోమ** పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ

**13 బుధ** శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**17 ఆది** మాస శివరాత్రి

**30 శని** తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జూలై 2012**

**3 మంగ** ఆషాఢ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం)

జూలై నెలలో **చాతుర్మాస్య కార్యక్రమాలు** శ్రీ మాతాజీవారు ఈ క్రింద సూచించిన ప్రకారం అనుగ్రహించారు)

**4-10** శ్రీ దండి నిర్మలానందగిరిస్వామి(అష్టలక్ష్మి పీఠం, తెనాలి) వారిచే "అపరోక్షానుభూతి" పై ప్రసంగం.

**11 -17** శ్రీ సుందరకాండ సత్యన్నారాయణ(సిద్దిపేట)గారిచే "సుందరకాండ" పురాణ ప్రవచనం.

18 - 24 శ్రీ స్వస్వరూపానందగిరి స్వామి (శ్రీ వసిష్టాశ్రమం, పద్మావతీనగర్, తిరుపతి)వారిచేఆధ్యాత్మిక ప్రవచనం.

**13 శుక్ర** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**16 సోమ** కర్కాటక సంక్రమణం దక్షిణాయణం ప్రారంభం

**17 మంగ** మాసశివరాత్రి

**27 శుక్ర** శ్రావణ శుక్రవారం - వరలక్ష్మి వ్రతం

### దానములలో ఉత్తమమైనది నేత్రదానము

ఇటీవల శ్రీసద్గురుసాయుజ్యం పొందిన శ్రీఈవూరి రోశిరెడ్డిగారు (హిందీమాస్టారు), మరియు మాగాపు అప్పారావుగారు తమ నేత్రాలను దానం చేసి ధన్యజీవులైనారు.

# అద్భుతమైన వధువు

– సుషుమ్న ప్రసాద

కురుక్షేత్ర రణరంగంలో శ్రీకృష్ణ భగవానుడు గీతా ప్రబోధం చేస్తూ విభూతియోగంలో **మాసానాం మార్గ శీర్షోహమ్** అని ప్రబోధించారు. అంటే 12 మాసాలలో మార్గశీర్ష మాసం నేనే యని ప్రబోధించారు. మార్గశిర మాసం ధనుర్మాసంగా యెంతో ఆధ్యాత్మిక ప్రతిపత్తి కలది. ఎందుకంటే యీ మాసంలోని బ్రాహ్మీ ముహూర్తమును దేవదినముగా పరిగణిస్తాము. భూలోక వాసులు ఒక సంవత్సరంగా పరిగణించే సమయము దివ్యులకు ఒకరోజు మాత్రమే. అందుచేతనే పరమశివునికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం తరువాత వచ్చే మార్గశిర మాసము (ధనుర్మాసం) చాలా పవిత్రమైనది.

వైష్ణవ సాంప్రదాయంలో ధనుర్మాసమునకు గోదాదేవితో ప్రగాఢమైన అనుబంధం ఉంది. భగవదనుభూతిలో సంపూర్ణముగ లీనమైన ద్వాదశ ఆళ్వారులలో గోదాదేవి ఒక మహిళ. శ్రీరంగనాధ ప్రభువునే పరిణయమాడాలి అనుకొన్న ఆమె ప్రగాఢమైన కోరిక ఆమె రచించిన ముప్పది పాశురములతో ఉన్న ఆధ్యాత్మిక ప్రబంధములో వెల్లివిరిసింది. ఆ ముప్పది పాశురముల ప్రబంధమే, తిరుప్పావైగా ప్రసిద్ధి చెందింది. ఆళ్వారులు నాలుగువేల దివ్య పాశురములతో ప్రసిద్ధి చెందిన **నాలాయిర** దివ్య ప్రబంధమునకను బంధమైనదే 143 పాశురములతో కూడిన **నాచియార్ తిరుయోఝి** మరియు **తిరుప్పావై.**

ఈ నాలుగువేల పాశురములలో ఆళ్వారులు తమ్మెతాము ఆ పురుషోత్తముని పొందుకోరే పడతులుగా భావించుకొని, తమ దివ్యానురాగమును వర్షింప జేశారు. వారి నాయికా నాయక అను బంధమును వధూత్వ అద్భుతంగా కీర్తింప బడింది. గోదాదేవి విషయంలో ఆమె వధూత్వ స్థితి చాలా సహజంగా, రమణీయంగా ఉంది. గోదాదేవి రచించిన రెండు గ్రంధాలలో జీవాత్మ, పరమాత్మలో లయమవటానికి పొందే ప్రగాఢమైన తపనను చాలా వివరంగా వర్ణించింది. ఆమె దివ్య వధువుగా శ్రీరంగనాధ స్వామిని వరించి, స్వామిలో లయమయి, అసాధ్యమైన దానిని సాధ్యమని నిరూపించింది.

గోదాదేవి విరచించిన తిరప్పావై ప్రబంధమును పండితప్రకర్ష కలిగిన

భక్తాగ్రేసురులందరూ వేనోళ్ళ కొనియాడారు. ఆ ప్రబంధము చతుర్వేదముల సారమని, జీవాత్మ పరమాత్మలో లయమవటానికి తిరుప్పావై నిశ్చితమైన, అద్భుత మార్గాన్ని సూచించిందని స్తుతించారు.

తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు గ్రామంలో ఆ క్షేత్రానికికారాధ్య దైవమైన శ్రీవటపత్రశాయిని సేవించే విష్ణుచిత్తుడనే మహాభక్తుడుండేవాడు. ఆయన తన పుష్పవనంలో వివిధరకాలైన పరిమళ భరితమైన పూలమొక్కలను పెంచి, ఆ పుష్పాలతో మాలలను తయారు చేసి, స్వామివారికి పుష్ప కైంకర్యం చేసేవారు. ఆయన ఆళ్వారులలో ప్రసిద్ధుడు. శ్రీవిష్ణుచిత్తుడు ఒకరోజు పుష్పవనంలో పుష్పాలను, తులసీదళములను సేకరిస్తుంటే, తులసి మొక్క దగ్గర ఒక పసిపాపను గమనించారు. వెంటనే ఆ పాపను తీసుకుని, ఆ బిడ్డతల్లి కోసం వెదికారు. కాని ఆయన ప్రయత్నం ఫలించలేదు.

ఆ పాపను విష్ణుచిత్తుడు భగవంతుని ప్రసాదమైన అపూర్వ వరంగా భావించి 'గోద' అని నామకరణం చేశారు. తమిళంలో 'గోద' అంటే 'మాల' అని అర్థం. ఆ పసిపాప దినదినాభివృద్ధిగా వర్ధిల్లుతూ, దివ్యాకర్షణ తేజస్సుతో ప్రకాశించే ఆ బిడ్డను చూసి, ఆనందాబ్ధిలో ఓలలాడారు.

గోదాదేవి తన పెంపుడు తండ్రి భక్తి ప్రపత్తులకు ముగ్ధురాలై, బాలకృష్ణుని వైభవోపేతమైన లీలలను వర్ణిస్తుంటే పరవశించి వినేది. వెంటనే ఆమె సంస్కార బలంతో కృష్ణపరమాత్మను ప్రగాఢంగా ప్రేమించి, ఆ ప్రేమ పారవశ్యంలో పరవశించింది.

గోదాదేవికి యుక్తవయస్సు రాగానే వివాహ విషయం ఆమెతో ప్రస్తావించాడు. కాని ఆమె శ్రీరంగనాధుని తప్ప ఎంత ప్రజ్ఞావంతుడైనా యే మానవమాత్రుని వివాహం ఆడనని దృఢంగా తన నిర్ణయాన్ని తండ్రికి నివేదించింది. విష్ణుచిత్తుడు ఆ విషయాన్ని చిరునవ్వుతో తేలికగా తీసుకున్నాడు.

ఎందుకంటే భగవంతుడైన శ్రీరంగనాధుణ్ణి వివాహమాడటమనేది మానవమాత్రులకసాధ్యమైన విషయం. కాని విష్ణుచిత్తులవారి ఊహ తారుమారు అయింది. ప్రభువుపై ఆమెకున్న దివ్యానురాగం దినదిన ప్రవర్థమానమై అవధులు దాటింది.

-సశేషం

# గురు కృపాహి కేవలమ్

సేకరణ–రమణ ప్రసాద్

శ్రీదేవీ సహస్ర చండీయాగం, కోటి కుంకుమార్చన, అఖండ హరినామ సంకీర్తన, సాధు ధర్మ సమ్మేళన ది. 12-2-2003 భీష్మ ఏకాదశి నుండి ది. 22-2-2003 వరకు లోక సంరక్షణార్థం శ్రీమాతాజీవారు చేయ సంకల్పించారు. ఆశ్రమంలో యాగ సన్నాహాలు చురుకుగా జరుగుతున్నాయి. వేలాది సంఖ్యలో వచ్చే భక్తులకు వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. గురుకులం ఎదురుగా బాలుర హాస్టల్ నిర్మాణం అప్పుడే జరిగింది. దాని నీటి సదుపాయం ఏర్పాట్లు చేయటానికి తెనాలి నుంచి శ్రీనివాస్, కుమార్ పంప్స్‌లో పనిచేసే ప్లంబర్‌ని యీ పనికి నియామకం చేశారు.

ఎంతో శ్రద్ధగా తనకిచ్చిన పనిని పూర్తిచేయాలనే సంకల్పంతో వున్నాడు శ్రీనివాస్. అప్పుడే చీకటి పడుతోంది. సింటెక్స్ ట్యాంక్‌ను హాస్టల్ బిల్డింగ్‌పైకి ఎక్కించాలి. తాను క్రింద ఉండి ట్యాంక్‌ను పైకెక్కించే ఏర్పాటును చేస్తున్నాడు. తాళ్ళతో కట్టి ఆ ట్యాంక్‌ను పైకి తీసుకెడుతున్నారు. తాళ్ళనుండి విడిపోయి ట్యాంక్ క్రిందనే ఉన్న శ్రీనివాస్ మెడపై పడింది. శ్రీనివాస్ అచేతనంగా పడిపోయాడు. కొంతసేపటికి స్పృహ వచ్చింది. అతని రెండుకాళ్ళు చచ్చుపడ్డాయి. మాట పడిపోయింది. అతన్ని సౌమ్య అపోలో హాస్పిటల్‌లో చేర్పించారు.

ఈ సంగతి తెలిసి శ్రీ మాతాజీ ఎంతో వ్యాకులత చెందారు. శ్రీరామ లింగేశ్వర స్వామివారి ఆలయంలో శివప్రసాద్‌గారితో శ్రీనివాస్‌కు సంపూర్ణ స్వస్థత చేకూరేందుకు మహన్యాస పూర్వక అభిషేకాలు, మృత్యుంజయ జపాలు చేయించారు. శ్రీమాతాజీవారు కూడా అతనికి స్వస్థత చేకూరేందుకు అనుష్ఠానం చేశారు.

స్పైనల్ కార్డ్‌కు ఆపరేషన్ చేయాలని, అది చాలా కాంప్లికేషన్స్‌తో కూడినదని దాని సక్సెస్ రేటు చాలా తక్కువ అని హాస్పిటల్‌లోని స్పెషల్ సర్జన్ చెప్పారు. శ్రీమాతాజీ 'మీరు ఆపరేషన్ చేయండి. తరువాత సంగతి శ్రీగురుదేవులే చూసుకుంటారు' అని చెప్పిన తరువాతనే ఆపరేషన్ చేయటానికి ఒప్పుకున్నారు. ఆపరేషన్ జరిగింది. 100% సక్సెస్ అయింది. ఆపరేషన్ చేసిన సర్జన్ ఎంతో ఆశ్చర్యపోయాడు. ఏదో దైవ శక్తి సహాయపడింది అన్నాడు. శ్రీనివాస్

కాళ్ళు స్వాధీనంలోకి వచ్చాయి, మాట వచ్చింది. శ్రీబాబు అనుగ్రహంతో, శ్రీమాతాజీవారి ఆశీర్వచన బలం వలన మళ్ళీ మామూలు మనిషి అయ్యాడు.

ఈ మధ్య తెనాలిలో పూజ్యశ్రీ దండి నిర్మలానంద స్వామివారి ఆధ్వర్యంలో సహస్ర కుండ యాగం ది.8-2-2012న జరిగింది. ఆ యాగానికి భక్తులందరం వెళ్ళాం. తెనాలిలో దారిపొడుగునా శ్రీమాతాజీవారికి స్వాగతం పలుకుతూ బ్యానర్లు కట్టి ఉన్నాయి. ఆ బ్యానర్లు శ్రీనివాస్ స్వంత ఖర్చుతో వేయించాడు. శ్రీమాతాజీవారి పట్ల తనకు ఉన్న కృతజ్ఞతా భావాన్ని యీ విధంగా వ్యక్తపరచాడు.

.................... ...................... ..................

గురుదేవులకు సాధ్యం కానిదేమున్నది? ఆనాడు సమర్థ రామదాసు వారు మధుకర్ అనే శిష్యుణ్ణి మృత్యువాత నుండి రక్షించలేదా? మధుకరికి వచ్చిన మధుకర్‌ని చూసిన జ్యోతిష్యశాస్త్ర పండితుడు జోషి 'నీ జన్మ తిథి ఏమిటి?' అని అడిగారు. మధుకర్ చెప్పాడు. జోషిగారు లెక్కలు వేసి, 'నా అంచనా నిజమైనది. 'చూడు బాబూ! రేపు యిదే సమయానికి నీకు మరణ గండం ఉంది. నీకు మృత్యువు ఖాయం. నీ ముఖంలో ప్రేతకళ వచ్చింది. మీ గురువుగారు సమర్థులు అన్నావే! ఆయన నిజంగానే సమర్థులైతే నిన్ను మృత్యు ముఖం నుండి విడిపించ గలగాలి. అలా జరిగితే ఎల్లుండి మధుకరికి రా. అప్పుడు భిక్ష వేస్తాను' అన్నాడు.

మధుకర్ సమర్థులకు జరిగిన విషయం చెప్పి ఏడవసాగాడు. సమర్థులు అతని ఒంటిపై చేయి వేశారు. అతని ఒళ్ళు జ్వరంతో కాలిపోతోంది. సమర్థులు 'ఒరేయ్! నేను పడుకుంటున్నాను. నా కాళ్ళు పడుతూ ఉండు. ఎవరు పిలిచినా వెళ్ళకు' అని నిద్రకు ఉపక్రమించారు. యమదూతలు వచ్చి మధుకర్‌ని పిలిచారు. 'నేను రాను'అని చెప్పాడు. చేసేది లేక యమదూతలు వెళ్ళిపోయారు. అప్పుడు యముడే స్వయంగా వచ్చి పాశం విసిరాడు. అది సమర్థులు కప్పుకున్న కంబళి దాకా వెళ్ళి ఆగిపోయింది. యముడు వెనుతిరిగి వెళ్ళిపోయాడు! మధుకర్ రక్షింపబడ్డాడు.

మన సద్గురుదేవులు శ్రీహనుమత్ కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారు కూడా అంతటి సమర్థులే! ఆయుష్షును మార్చగల ప్రతిభావంతులే!

- సశేషం

# శ్రీకృష్ణకర్ణామృతం

–సుశీలా ప్రసాద

22 శ్లో. విచిత్ర పత్రాఙ్కుర శాలి బాలాస్తనాన్తరం మౌని మనోన్తరం వా।
అపాస్య బృన్దావన పాదపాస్యముపాస్య మన్యన్నవిలోక యామః ॥

"సవితా! నీ తపస్సు ఫలించే తరుణం అసన్నమైంది. ఇక సమాధి చాలించు వత్సా!" అనే దివ్యవాణి వింటూ కనురెప్పలల్లార్చి మెల మెల్లగా కనులు విప్పాడు సవిత. మధురమైన ఆ మాటలు పలికిన మూర్తి తన యెదుట కనగలనని ఆశపడుతూ. తనకి ఎదుట ఎవరూ కనబడలేదు. అంతలో మళ్ళీ "చూడు నాయనా! ఇప్పుడే నీకు నా దర్శనం కాదు. అవనిలో అవతరించిన నన్ను గుర్తించినప్పుడే మహాఫల సంధాయకుడనైన నేను నీవు కోరిన మోక్షాన్ని అనుగ్రహిస్తాను. ఇప్పుడే నీవు యీ తావు నుంచి బయలుదేరు. నీకు యధేచ్ఛగా సంచరించగల శక్తిని ప్రసాదిస్తున్నాను" వినువీధి నుండి వీనుల విందుగా వినవచ్చిన ఆ సందేశాన్ని ఆజ్ఞగా శిరసావహించిన సవిత తలవంచి కృతజ్ఞతా పూర్వకంగా అంజలి ఘటించి కనుదోయి ముకుళించిన ఆ క్షణానే.....

కళకళలాడిపోతున్న జనసందోహం నిండిన ఏదో మహానగరం అది. అంతా కలయచూస్తూ యిదే ప్రదేశం? తానెక్కడ ఉన్నాడు? అనుకున్నాడు సవిత. అప్పుడే అతని చెవిలో గుసగుసగా వినవచ్చింది "ఇది మధురా నగరం" అని. ఆ చెప్పిందెవరో! ఆలోచిస్తూ విస్మయంగా అన్నీ గమనిస్తూ ముందుకు కదిలాడు. అక్కడక్కడ గుంపులు గుంపులుగా ఉన్న మనుష్యులు కనిపిస్తున్నారు. ఒక చోట ఆగాడు. అతి మెల్లిగా ప్రక్కవాళ్ళకి మాత్రమే వినబడేటట్లుగా మాట్లాడుకుంటున్నారు వాళ్ళు. కనపడని దైవం తనకిచ్చిన వరంతో సవిత వాళ్ళ సమీపానికి వెళ్ళి నిలచినా వాళ్ళు గమనించినట్లు లేదు. "పూతన చనిపోయింది. శకటాసురుడు చచ్చాడు! ఈసారి ఎవరో! " ఇంకో గుంపు దగ్గరకి వెళ్ళాడు. "వెళ్ళిన వాళ్ళెవరూ తిరిగి రావటం లేదు. అయినా పట్టు విడవటం లేదు, ప్రాణాల మీద తీపితో మహారాజు.!" చచ్చినవాళ్ళెవరో, ఆ మహారాజెవరో సవితకి అర్థం కాలేదు. అయినా తనకి ఆ విషయం అనవసరం. భువిలో వెలసిన పురుషోత్తముని తాను గుర్తించగలగాలి. అదే తన ధ్యేయం.

శంఖ చక్ర గదాధారి, శ్రీవత్సకౌస్తుభ లాంఛితుడు, చతుర్బాహుడు అయిన వైకుంఠవాసిని గురించి తను తపస్సు చేశాడు. స్వామిని దర్శించి

తను మోక్షం పొందాలనుకున్నాడు. తన ఆరాధ్యదైవం తన తపోఫలాన్ని తనకి తప్పక ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు. కాని తాను స్వామిని చూడగలగాలి. అదేలాగ? ఎక్కడ? ఎప్పుడు? సవిత హృదయం తల్లడిల్లుతున్నది. అరచేతిలో అమృతం ఉంది. అది పెదవులకందాలి. ఆరగించి తాను అమృత స్వరూపుడు కావాలి. అందుకు తనకి సహాయపడేదెవరు?

"నేను" అనే మాట విని ఉలిక్కిపడ్డాడు సవిత. తన మనస్సులోని భావాన్ని గ్రహించినవారెవరు? ఉలిక్కిపడి చూశాడు. ఒక పండు ముదుసలి తన ప్రక్కగా నిలబడి ఉన్నాడు. ఆయన మాట్లాడుతూ "ఈ దాపునే ఉన్న పల్లెకు వెడదామనుకున్నాను. కాస్త నాకు తోడుగా రాగలవా?" అని అగుతున్నాడు సవితని. తన సంగతేదో తను చెబుతున్నాడు అనుకొని సవిత "పదండి తాతా! నాకు దిక్కు తోచకుండా ఉంది ఎలాగునూ" అన్నాడు. "దిక్కులేనివారికి దేవుడే దిక్కు నాయనా! అది గుర్తుంచుకో" అని పలికి ఆ వృద్ధుడు మళ్ళీ "నీకు నడిచే దోవలో అలసట తెలియకుండా ఉండేందుకు నేనెన్నో ఊసులు చెప్పగలను. నీకు దారి కూడా నేనే చూపుతాను" అన్నాడు. వానిమాటలకు అంగీకరిస్తూ సవిత వాని వెంట నడిచాడు.

"కథే అనుకో, యదార్థమే అనుకో. నువ్వు వింటూ ఉంటే అంతే చాలు" అంటూ వృద్ధుడు చెప్పటానికి ఉపక్రమించాడు. "ఒక నగరానికి ఒక రాజు వున్నాడు. వాడు చాలా దుష్టుడు. రాక్షస జాతి. వాడు కొత్తగా పెళ్ళయిన చెల్లిని బావని రథంలో తీసుకెడుతుంటే ఆ చెల్లి ఎనిమిదో గర్భం వాడిని సంహరిస్తుంది అని ఆకాశవాణి పలికింది. దాంతో బెదిరిపోయిన ఆ రాజు ఆ నవ వధువును చంపబోయాడు. బావగారు నచ్చచెప్పగా అప్పటికి శాంతించాడు. తనకి ముప్పు ఎనిమిదో గర్భం కదా అని అప్పటిదాకా ఊరుకున్నాడు. అయితే వాడి పాపం పండేందుకు, వాడి హంతకుడైనవాడు సామాన్యుడు కాదని వాడి తోడివారంతా దైవాంశ సంభూతులని విని కోపంతో రెచ్చిపోయి విరోధులైన చెల్లెల్ని, బావగారిని చెరలో వేసి, వాళ్లకి ముందుగా పుట్టిన బిడ్డలందరినీ చంపేశాడు. ఎనిమిదో బిడ్డ వాడికందకుండా చిత్రంగా కనబడకుండా పోయింది. గాలి కబురుతో ఊపిరి సలపకుండా ఉన్న ఆ హంతకుడు తన అనచరులందరినీ పంపించి ఆ బిడ్డ కోసం గాలిస్తున్నాడు. లోకకళ్యాణ కారకుడైన ఆ శిశువు తను వచ్చిన పని చేసే తీరతాడు. వాడు ప్రస్తుతం తన్ను ఆశ్రయించిన వారందరికీ ఆనందాన్నిచ్చే మహత్కార్యంలో ఉన్నాడు.

–సశేషం

## గర్భిణీ స్త్రీలకు శుభవార్త!

శ్రీశ్రీశ్రీ సమర్థ సద్గురు హనుమత్కాళీ వర ప్రసాదబాబూజీ ట్రస్ట్ హాస్పిటల్ శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో, సద్గురుదేవుల దివ్య ఆశీస్సులతో పూజ్యమాతాజీ అనుగ్రహంతో **ఉచిత ప్రసూతి వైద్యసేవలను** అక్టోబర్ 2011 నుంచి అందిస్తున్నారు. ప్రసూతి పరీక్షలు, అవసరమైన మందులు, ఆపరేషన్ ఖర్చులు, సాధారణ డెలివరీ ఖర్చులు మొ॥గు సర్వవిధమైన ఖర్చులను ఉచితంగా అందించి, తల్లీ బిడ్డలను క్షేమంగా యింటికి తరలించేవరకు ఖర్చు ట్రస్టుఆసుపత్రివారే భరిస్తారు. ఇంతవరకు 12 సిజేరియన్ ఆపరేషన్లు, 56 సాధారణ ప్రసవములు వుచితంగా జరిపించారు. బయట ఎంతో వ్యయంతో కూడుకుని ఉన్న ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ హాస్పిటల్ ఉచితంగా అందిస్తోంది. కాబట్టి ఈ సదావకాశాన్ని గర్భిణీస్త్రీలు ఉపయోగించుకో వలసినదిగా తెలియ జేస్తున్నాము.

ఒక సాధారణ ప్రసవానికి 5,000రూ॥లు, సిజేరియన్‌కి 10,000 రూ॥లు ఖర్చు అవుతుంది. దాతలు 5,000రూ॥లు యిస్తే వారి పేరున ఒక సాధారణ ప్రసవము, 10,000 రూ॥లు యిస్తే వారి పేరున ఒక సిజేరియన్ జరుపబడును. 50,000 రూ॥లు యిస్తే, దానిమీద వచ్చే ఆదాయంతో వారిపేరున ప్రతి సంవత్సరం ఒక ఉచిత ప్రసవం చేస్తారు.

వివాహాది శుభ కార్యములలో దాతలు తాము యివ్వదలచిన బహుమతిని విరాళంగా వారిపేరున ట్రస్ట్ హాస్పిటల్‌కు యివ్వవచ్చును. దాతలు వుదార హృదయంతో ముందుకు వచ్చి తమ చేయూతనిచ్చి ట్రస్ట్ హాస్పిటల్‌వారు తలపెట్టిన యీ ఉచిత సేవాకార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగేటట్లు చేస్తారని ఆశిస్తున్నాము. ఇట్టి విరాళములకు ఆదయపు పన్ను రాయితీ (80G) లభిస్తుంది.

- ట్రస్ట్ హాస్పిటల్

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులైన ఈవూరి రోశిరెడ్డిగారు 4-5-2012 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు హిందీమాస్టరుగా అందరికి చిరపరిచితులు. వీరు ఆశ్రమానికి ఎనలేని సేవలను అందించారు. వీరి వయస్సు 76సంవత్సరాలు. వీరికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమడు, మనుమరాలు కలరు. సద్గురుదేవులు వీరికి ఆత్మ శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

**బ్రహ్మ సత్యం జగన్మిధ్య**గా చెప్పుకోవటం విన్నాం గాని, **బ్రహ్మ సత్యం జగత్ బ్రహ్మ**గా విశ్వసించటం అసాధ్యం అని సందేహాన్ని లేవనెత్తిన ప్రొఫెసర్‌గారికి సమాధానంగా శ్రీసద్గురుదేవులు చెపుతూ.......

"తన చుట్టూ గోడలు కట్టుకుని పెద్దపెద్ద భవనాలు నిర్మించుకుని ఎ.సి.లు ఫ్రిజ్‌లు, హోదాలు, భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండేవారికి బ్రహ్మ సత్యంగా గోచరించవచ్చుగాని, జగత్తు బ్రహ్మగా గోచరించటం అసంభవమే.

సద్గురుమూర్తి పాదములు ఆశ్రయించినవారు, వారు సూచించిన మార్గమును అనుసరించాలి కదా! అదే ఆచరణ. అది వారి అనుగ్రహానికి దోహదం చేస్తు ంది. సద్గురుమూర్తి పద రాజీవములను ఆశ్రయించి ఆయన సూచించిన మార్గములో సాధన చేసేవారికి బుద్ధి సమస్థితిలో ఉంటుంది. అదే సమాధి.

అక్కడ ద్వైతానికి తావు లేదు. అక్కడ హెచ్చుతగ్గులు లేవు. రాగద్వేషాలు లేవు. మనస్సు అటు యిటు తిరగదు. మనస్సుకి కదలికలు లేవు. జారిపోదు. సంకల్ప వికల్పాలకు తావు లేదు. ఆ స్థితినే బుద్ధ భగవానుడు నిర్వాణ స్థితి లేదా శూన్య స్థితి అన్నాడు. నిశ్శబ్ద స్థితి. నీటిలో బుడగలు లేకపోతే బుడబుడమని శబ్దం ఉండదు. దానిని అపార్థం చేసుకుని కొంతమంది వ్యాఖ్యానకారులు నాస్తికవాదము అన్నారు.

బుద్ధ భగవానుడు అనుభవించింది పూర్ణస్థితి. అద్వైత స్థితి. ఆ స్థితిలో బ్రహ్మ సత్యం జగత్ బ్రహ్మగా భావన నిలిచిపోతుంది. అంతా బ్రహ్మమయమే. అదే నిజమైన అద్వైతానుభూతి.

తన కడుపు నింపుకోవటానికే లేనివాడు వేరొకడి ఆకలి ఎలా తీర్చగల్గుతాడు? మీరే చెప్పండి ప్రొఫెసర్‌గారూ? అని ప్రశ్నించారు గురుదేవులు.

బ్రహ్మ సత్యం అని అంగీకరిస్తున్నారు కదా! బ్రహ్మ సర్వవ్యాపకమైన వాడు అని అంగీకరిస్తున్నారు. ఇక జగత్తు అంతా వ్యాప్తమైన బ్రహ్మని **బ్రహ్మ సత్యం జగత్ బ్రహ్మ** అని అనటంలో తప్పు పట్టవలసిన అంశం లేదే!

*

# పుట్టిల్లు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

చేపకు పుట్టినిల్లు నీరు. ఆ నీటియందే దానికి ఆనందము. ఆ నీటి యందే దానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, నిర్భయత్వము. దానిని అచ్చోటి నుంచి బయటకు తీసుకు వచ్చి, చక్కటి పాన్పుపై పరుండబెట్టి, వింజామరలు వీచుచు, సమస్త రాజోపచార, దేవోపచారములు చేసినను దానికి తృప్తి యుండదు. ఆనందము కలుగదు. స్వస్థానమగు నీటినే అది అహర్నిశలు వాంఛించు చుండును. దాని యందే పరమ శాంతి బడయుచుండును.

అట్లే జీవుని పుట్టిల్లు పరమాత్మ. అట్టి పరమాత్మను జేరువరకు అతడు విశ్రమించరాదు. ప్రతిక్షణము ఆ మహోన్నత లక్ష్యము కొరకే తీవ్రతర ప్రయత్నము సలుపుచుండవలెను. విషయ భోగాదులయందు ఆసక్తిని బొందరాదు. అవి యెంత రమణీయముగను, ఆకర్షణీయముగను ఉన్నప్పటికినీ ఆత్మసుఖమునకు తీసికట్టేయగును. ప్రతిబింబసుఖము ఎంత గొప్పదైనప్పటికి బింబసుఖమునకు సాటికాజాలదు.

నీతి - ప్రతి మానవుడును తన పుట్టిల్లగు ఆత్మను చేరుటకై వివేక వైరాగ్యాలను చక్కగ అభ్యసించి, ఆత్మేతర వస్తువుల యెడల విరాగము కలిగి ఉండవలెను.

*

1. నీ కళ్ళు దయా దృష్టితో చూడనీ, నీ నాలుక సౌమ్య వచనములను పలుకనీ, నీ హస్త స్పర్శ మృదులమై ఉండనీ.
2. ప్రేమ క్షమా స్వభావము కలది, ప్రేమ వివేకమును ఒసగ గలది.
3. ప్రేమ కష్టముల నుండి గట్టెంక్కించగలది మరియు పరివర్తన మొనర్చ గలది. అట్టి ప్రేమ మనకు రక్షణ కవచము.
4. ఎడబాటు అను స్వప్నము నుండి మేలుకో. వాడూ నీవూ విడియై రెండుగా లేనట్లు ఎరుగుము. బ్రతుకంతా ఒక్కటే.

–స్వామి రామదాస

# శ్రీచంద్రకాళీ విద్యానిధి

## శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబు రెసిడెన్షియల్ స్కూల్

శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారి ఆశీస్సులతో, మరియు శ్రీమాతాజీవారి ఉన్నత ఆశయాలతో అభివృద్ధి చెందుతున్న గురుకుల పాఠశాలకు, ఒక భక్తుడు, ఆశ్రమనివాసి అయిన శ్రీకొండ వెంకట రాజుగారు, కీ.శే శ్రీ కొండ శేషంరాజుగారి కుమారుడు గత 4సం॥లుగా పేద విద్యార్థులను ప్రోత్సహించి ప్రతిసంవత్సరం 50మందికి స్కాలర్‌షిప్ రూపమున 2000 రూ॥ నుండి 5000 రూ॥ల వరకు ఆర్థిక సహాయముతోపాటు ఉచిత పుస్తకాలు, యూనిఫారములను అందజేయుచున్నారు. అంతేకాకుండా యీ స్కాలర్‌షిప్‌లు పొందిన మెరిట్ విద్యార్థులకు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ మరియు పి.జి. కోర్సులలో ఆర్థిక సహాయం అందజేయటతో పాటు వారు ఈ సంవత్సరం ఒకకోటి ఇరవై లక్షలను విరాళముగా ఇచ్చి **శ్రీచంద్రకాళీ విద్యానిధి** అనే ఫండ్‌ను నెలకొల్పి,ఈ నిధి ద్వారా మరొక 45మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయ వలెనని వారి ఉన్నత ఆశయము.

స్కూలు వివిధ పురోభివృద్ధి కార్యక్రమాలను చేపట్టటానికి "శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాదబాబు ట్రస్ట్ స్కూల్ - శ్రీచంద్ర కాళీ విద్యానిధి"ని స్థాపించి దానికి శ్రీ వెంకటరాజుగారు ముప్పై లక్షల విరాళాన్ని మేచింగ్ గ్రాంట్ పద్ధతిలో ఇచ్చుటకు నిశ్చయించారు. ఉదాహరణకు ఈ నిధికి దాతలు ఒక లక్ష రూపాయిలు ఇవ్వదలచినచో వీరుకూడా ఒక లక్ష రూపాయలను ఈ నిధికి ఇస్తారు. కావున దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు మరియు స్కూలు అభివృద్ధికి తగిన రీతిలో సహాయాన్ని అందించవలసినదిగా కోరుచున్నాము. విరాళములకు ఇన్‌కమ్ టాక్స్ రాయితీ కలదు. మిగతా వివరాలకు స్కూల్ మేనేజ్‌మెంట్‌వారిని సంప్రదించ ప్రార్థన.

ఫోన్ నెం. 0863 - 2594211 సెల్ - 93932 20400, 93944 54647

# మౌన ధ్యాన సప్తాహ శిబిరం

(గత సంచిక తరువాయి) –రమణ ప్రసాద్

మీరు ధ్యానంలో ఎలా కూర్చున్నా ఆసన సిద్ధి ముఖ్యం. నిటారుగా కూర్చోవాలి. వయస్సు మళ్ళినవారు అలా కూర్చోలేకపోయినా వారి మనస్సు గురుదేవుల పాదాల యందుంచాలి. *'ధ్యానానికి మూలం గురు స్వరూపం. గురుపాదాలు పూజకు మూలం. గురువాక్యమే మంత్రరాజం. గురు కృపయే ముక్తికి మూలం'* అని గురుగీత చెబుతోంది.

సాధన విషయంలో సాధకుని ఆవేదన ఎలా ఉండాలి అంటే, చుట్టూ అగ్ని ఉండి మధ్యపిల్లి ఉంటే, ఆ పిల్లి బయటకు పోవటానికి ఎంత ఆవేదన పొందుతుందో అంత ఆవేదన మనకి కలగాలి. అటువంటి ఆవేదన మనకు ఎలా వస్తుంది? సమర్థ రామదాసు శిష్యుడైన మధుకర్ సంగతి తీసుకుందాం. "రేపు మధ్యాహ్నానికి నీవు మరణిస్తావు. నీ గురువు సమర్థులు అన్నావుగా! వారిని రక్షించమను. నువ్వు జీవించి ఉంటే ఎల్లుండి రా. నీకు భిక్ష వేస్తాను''అని జోషి అనే జ్యోతిష్యాచార్యుడు చెప్పినప్పుడు మధుకర్ ఎంత ఆవేదన చెందాడో అంత ఆవేదన చెందాలి. గ్రహాలు ఏ స్థానంలో ఉన్నా గురు అనుగ్రహంవుంటే చాలు.

***కాకే ద్వారే జాయె సిర్ నావూ...*** నిన్ను విడిచి ఎక్కడికి వెళ్ళగలను ప్రభూ? నువ్వు తప్ప నాకు యింకెవరున్నారు? అంటుంది మీరాతల్లి. భగవంతుడు కరుణామయుడు. భక్తుల మొర ఆలకిస్తాడు. గంజేంద్రుని పిలుపుకు భగవంతుడు కూడా ఎదురు చూశాడట. సృష్టికేనా ఆవేదన? మనల్ని సృష్టించిన భగవంతునికి వుండదా ఆవేదన? గురుదేవులు శ్రీనాధుని గురించి యిలా చెప్పేవారు "బావగారూ! గజేంద్రుని పిలుపు వినగానే ఏ ఆయుధమూ ధరించకుండా, ఏ పరివారం లేకుండా ఎలా వచ్చాడయ్యా హరి? చెప్పండి మీరు భాగవతంలో అలా వ్రాసుకున్నారుగదా!'' అని పోతనగారితో అంటే నవ్వి ఊరుకున్నాడు పోతన. కాని పోతన కుమారుడు ఒకరాతిని నూతిలో పడవేసి "మామయ్యా! మీ అమ్మాయి నూతిలో పడిపోయింది'' అంటే భోజనం చేస్తున్న శ్రీనాధుడు వున్నపళంగా వస్తే "మామయ్యా! మీ అమ్మాయిని ఎలా రక్షిద్దామని వచ్చావయ్యా? నిచ్చెన గాలం లేకుండా ఎలా వచ్చావు? మరి నువ్వే యిలా వస్తే, లక్ష్మీదేవి చెంగు పట్టుకున్న ఆ హరి రాడా?'' అంటాడు.

గోదావరి పుష్కరాలకు శ్రీబాబు కోనసీమ తీసుకువెళ్ళారు. అందరూ స్నానం చేస్తున్నారు. ఇంతలో సుడిగుండం ఏర్పడి అందరూ ఆ గుండంలో

చిక్కుకుపోయారు. స్వామి అందరినీ పిలిచారు. "మీ అమ్మాయి మునిగి పోతోంది, మీ అబ్బాయి మునిగిపోతున్నాడు, వచ్చి రక్షించుకోండి'' అంటే ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. మరి స్వామికి తప్పదు కదా! '.అమ్మా! జగజ్జననీ!' అంటూ తాను ధరించిన వస్త్రాన్ని సుడిగుండంలోకి విసిరారు. అందరూ ఆ వస్త్రాన్ని పట్టుకుని బయటపడ్డారు. ఎదురుగా ఉన్న పరమాత్మను గుర్తించలేక పోతేనే ఆవేదన, ఆవేశం వస్తాయి. వీరందరినీ ఎవరు రక్షించారు? ***ఐసే కో దాతాహై సమరథ్ దియో అభయపథ్ ఢావూ....***ప్రభూ! అంత్యకాలంలో నీ స్మరణయే మాకు రక్ష. నాపై కృప చూడు. నీ అభయ పదాన్ని అందించు - అని సూరదాసు ప్రార్థిస్తాడు. తవ పరివారం వీడిపోయినప్పుడు గజేంద్రుడు ఎవరిని వేడాలా? అని ఆలోచించి 'ఎవనిచే ఈ జగం జనించి ఎవ్వనిలో లీనమవుతోందో ఆ పరమేశ్వరుని, మూలకారణమైనవాడిని, ఆత్మభవుని శరణు వేడుకొంటాను' అని నిశ్చయించుకున్నాడు.

ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నా మనకి కావలసినది గురువు అనుగ్రహం ఒక్కటే. గురుదేవులు తమ అనుగ్రహాన్ని మనపై సంపూర్ణంగా వర్షింపజేస్తున్నారు. గురుదేవులు ఆనంద స్వరూపులు. అది అఖండం, అరూపం, సర్వవ్యాపకం. ఆ ఆనందం అనుభవైకవేద్యం. ఉప్పు బొమ్మ సముద్రంలోతు చూడాలని వెళ్ళి అక్కడే లయించిపోయింది. అటువంటి అనుభూతిని పొందటానికి మనం ప్రయత్నిస్తున్నామా? రాధ అట్టి అనుభవాన్ని పొందటానికి విరహంతో తపించింది.ఆహార పానీయాలు మానేసింది. ఆమె సఖి వెళ్ళి "నీ యందు దీనత్వంతో విరహం చెందుతోంది రాధ'' అని కృష్ణుడితో చెప్పింది. మనం అట్టి విరహంలో ఉన్నామా? ఆమెకి చంద్రుని కిరణాలు వేడినిస్తున్నాయి. చంద్రుని కిరణాలకై ఎదురుచూసే చకోరంలా గురుచంద్రుడి అనుగ్రహం కోసం మనం పరితపించాలి. మనకి పంచ వాసనలు అడ్డువస్తున్నాయి. మనకు భగవంతుని పై ప్రీతి పెరగాలి. ఇతర విషయాలపై ప్రేమ నశించాలి.

మనం పొందే ఆనందానుభూతి వారు యిచ్చినదే. మన స్వభావం కేవలం ఆనందమే. ఆనందోహం. అది మారేది లేదు. అటువంటి ఆనంద స్వరూపులు ఉత్కృష్టమైన మానవజన్మనిచ్చి మనను భగవంతుని వద్దకు చేరుస్తున్నారు గురుదేవులు. బ్రహ్మానందంలో ఓలలాడింప జేస్తున్నారు. మన మనస్సులను నిర్మలం చేసుకుంటే ఆ బ్రహ్మానందానికి మనం వారసులం అవుతాం!!

-సశేషం

(గత సంచిక తరువాయి)

## శివానందలహరి

–బులుసు మల్లిక్ USA

***స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితాగాన ఫణితౌ***
***పురాణే మంత్రే వా స్తుతి నటన హాస్యే ష్వచతురః***
***కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోహం పశుపతే***
***పశుం మాం సర్వజ్ఞ ప్రథిత కృపయా పాలయ విభో ॥***

శంకరులు శరణాగతి నేర్పుతున్నారిక్కడ. ముందస్తుగా దైన్యాన్ని ప్రకటించడం నేర్పుతున్నారీ శ్లోకంలో. ఎందుకంటే ఈశ్వరుడు దీనబాంధవుడు కదా. దీనికే నారద భక్తి సూత్రము కూడా '***ఈశ్వరస్యాభిమాన ద్వేషిత్వా ద్దైన్యప్రియత్వాచ్చ***' అని నొక్కి వక్కాణించింది. దైన్యం లేనిదే జ్ఞానముండి కూడా లాభమేముంది? అయితే యివి శంకరులు అనవలసిన మాటలటండీ? ఎవరిని లోకమంతా '***శృతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం***' అని కొనియాడిందో, ఆయనే నాకు స్మృతి శాస్త్రాదులలో ప్రవేశం లేదనడం భావ్యమా? పిన్న వయస్సులోనే చతుర్వేదసారాన్ని అలవోకగా నేర్చుకున్న శంకరులే తమకు శాస్త్ర పరిచయం లేదంటే మనం నమ్మగలమా? మరి అలా ఎందుకంటున్నారు?

కోటివిద్యలూ కూటికోసమే కదా అని నానుడి. అంటే మనం విద్య అనే పేరుతో నేర్చుకునేదంతా బ్రతుకుతెరువుకే. ఇంజనీరింగ్ చదువుకునే రోజుల్లో మేము హాస్టల్లో ఉండేవాళ్ళం. వార్తాపత్రికలని చదివే అలవాటు లేకపోయినా ఆఖరి సంవత్సరంలో ప్రత్యేకించి మా హాస్టలుకి వచ్చే పేపర్లని అన్నిటినీ తిరగేసేవాళ్ళం. ఉద్యోగాల ప్రకటనలకై ఎంతో ఆశతో ఎదురు చూసేవాళ్ళం. జీవితంలో ఏదో సఫలీకృతం కావాలనే ఆకాంక్ష. ఎక్కడో ఇంజనీరు కావలెనో, లెక్చరరు కావలెనో, లేక ఇంకెవరో కావలెనో ప్రకటన కనబడితే అది మాకు తగినదో కాదో అనే ఆతురత. శంకరులు కూడా అప్పటి కాలంలో ఉన్న ఉద్యోగాలెలాంటివో బయటకి తెస్తున్నారిక్కడ. అయితే శంకరులు విద్యని బ్రతుకు తెరువుకి మార్గంగా ఎన్నడూ పరిగణించలేదు. ఆయన చదువులన్నీ ముక్తికి మార్గదాయకం కావాలని, అలాంటి ముక్తి విద్య మనబోటివారికి కరతలామలకం కావాలని పరితపించారు.

స్మృతిలో ప్రవేశం లేదంటున్నారు. ఏమిటండీ స్మృతి? **వేదం అపౌరుషేయమైతే స్మృతి పౌరుషేయం. 'మహర్షిభిః వేదార్థ స్మరణ పూర్వకం రచితత్త్వాత్ స్మృతిః'** అని అమరకోశమంటోంది. అంటే ఋషులు వేదార్థసారాన్ని దృష్టిలో పెట్టుకుని స్మృతులని రచించి మనకందించారు. ఇంకా శాస్త్రంలో పరిచయం లేదంటున్నారు. 'ఏదేని దృక్కోణంలో విశ్వాన్ని పరిశీలనం చేయడానికే శాస్త్రం ఉపయోగపడుతుంది. ఉదాహరణకి భౌతికశాస్త్రమో, ఖగోళశాస్త్రమో లేక రసాయనశాస్త్రమో చూడండి. ఒక్కొక్క కోణంలో ప్రపంచంపై అవగాహన ఏర్పర్చుకునేందుకు యీ శాస్త్రాలు దోహదపడతాయి. అంతేకాదు. '***నిదేశ గ్రంథయో శ్శాస్త్రమ్***' అని అమరకోశమంటోంది. అంటే ఆజ్ఞకును, వ్యాకరణాది గ్రంథాలకు శాస్త్రమని పేరు. వీటిలో ప్రావీణ్యముంటే ఉద్యోగాలు సంపాదించుకోవడం సులభం.

అంతేకాదు. ఇంకా తాను వైద్యుణ్ణి కాదంటున్నారు. వైద్యుడైతే ఓ గొప్పింటి వాడికి వైద్యం చేసి సొమ్ములు సంపాదించవచ్చుకదా. శకునం కాని, జాతకంకాని చెప్పి డబ్బు సంపాదిద్దామా అంటే ఆ విద్య కూడా తెలియదట. విచిత్రమేమిటంటే కవిత్వం రాయడం చేతకాదట. అది అబద్ధం కాదండీ? ఎవరు అద్భుతమైన భక్తిరచనలని మనకి అందించారో, అద్వైతామృతాన్ని మనకోసం క్రోడీకరించారో ఆయన యిలా అనటం అనౌచిత్యం కాదా? అలాగే పాటలు పాడి ఒకరి మనస్సు రంజింపజేసి నాలుగురాళ్ళు పోగు చేసుకుందాం మంటే అది కూడా చేతకాదట.

ఇకపోతే పురాణాలు చెప్పుకుని ఊరూరా తిరిగి ధన సముపార్జన చేద్దామంటే పురాణాలు తెలియవట. మంత్రాలు నేర్చుకోలేదట. నేర్చుకొనే వుంటే పూజక్రియలని జరిపించి కూడా దక్షిణలు పొందవచ్చు కదా. ఇకపోతే స్తుతితో ఎవరినైనా మెప్పించడం చేతకాదట. ఇది కూడా నమ్మలేము. ఎందుకంటే '***అంగం హరేః పులక భూషణ మాశ్రయంతీ***' అన్నారు కదా లక్ష్మీదేవిని స్తుతిస్తూ. ఎవరికోసం? కడుపేదరాలి దరిద్రాన్ని వినిర్మూలించాలనే కాని, తాను కాసులకి, ధనరాసులకి ఎగబడికాదు. అలాగే నటన, హాస్యాదులు తెలియవంటున్నారు. ఏవో నాటకాలలో పాత్రాభినయం చేసో, లేక హాస్యంతోనో జనులని రజింపచేయవచ్చుకదా. అది కూడా బ్రతుకుతెరువుకి సులభోపాయమే కదా, అవి కూడా చేతకావట.

ఇంకా ఏమంటున్నారంటే యిన్ని అసమర్థతలతో రాజులప్రీతి

పాత్రులవటం కష్టం కదా అంటున్నారు. ఎందుకంటే ధర్మబద్ధంగా రాజ్యపరిపాలన చేసే రాజులు శాస్త్రాలని పరిరక్షించి కళలని పోషించేవారు. ఎన్నో ఉద్యోగాలకి అవకాశాలను కల్పించేవారు. అయితే శంకరులు ప్రకటించిన అసమర్థతలన్నీ ఆయన ప్రయత్నపూర్వకంగా విసర్జించిన కళలని చెప్పవచ్చు. ఎందుకంటే శంకరులు ఈశావాస్యాన్ని అవగాహన చేసుకుని తదనుగుణంగా జీవితాన్ని గడిపారు. '***ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్***' అని కదా ఈశావాస్యోపనిషద్వాక్యం. ఇంక ధనసముపార్జనకి చోటేది? అది తెలిసి తన బ్రతుకు భారాన్ని భగవంతునిపైకి వేస్తున్నారు.

నిజానికి ఆదిశంకరుడు అనాది శంకరుడు కాదూ? విచిత్రమేమిటంటే ఆయనే పశుపతిని ప్రాధేయిస్తూ '**పశుం మాం**' అంటున్నారు. ఏ చదువూరాని వాడిని పశువు అని కదా లోకం సంబోధిస్తున్నది. అంటే వినయంలేని విద్య కూడిరాదని మనకు తెలియబరచటమే దీని గూడార్థం. అలా శంకరులు తన అశక్తతను ప్రకటిస్తూ సర్వజ్ఞుడైన ఆ సదాశివుని పాదాలని గట్టిగా పట్టుకొని ప్రార్థిస్తున్నారిక్కడ. కరుణతో రక్షించమని భగవంతుని కోరుతున్నారు. మనం కూడా పరమేశ్వర పాదాలని ఆశ్రయిద్దాం. తత్కృపకు పాత్రులమౌదాం!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు పరమ భక్తులైన వంకెన బుల్లెమ్మగారు ఆశ్రమ స్థాపన జరిగినప్పటి నుంచీ ఆశ్రమంలోనే స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఎనలేని సేవలను అందించారు. గత కొద్దికాలంగా వీరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. 21-4-2012 శనివారం నాడు వీరు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు. వీరికి ఇద్దరు కొడుకులు కోడళ్ళు, ఇద్దరు కూతుళ్ళు అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు కలరు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గతసంచిక తరువాయి) – స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

ఆ తరువాత ప్రారంభమైన ఆరాధన కార్యక్రమంలో అనేక విషాదకర సంఘటనలు జరిగినట్లు, ఉత్పాతములు కలిగినట్లు తెలిసింది. వారిలో దురభిమానులైన కొందరు, పెద్దలనే ధిక్కరించటం, దూషణ చేయటం జరిగింది. చివరకు గురుపీఠం అధిష్టించిన వారినే ఒకరు కాలితో తన్నటం జరిగిందని, రసాభాసతో ఆ కార్యక్రమం ముగిసిందని, కాలితో గురుపీఠం తన్నినవారికి అంటరాని వ్యాధి సోకిందని తెలిసింది. తరువాత శ్రీపరశురామయ్యగారు ఆ సంఘమునకు, సంఘ కార్యక్రమాలకు పూర్తిగా దూరమైనారు.



1947లో యనమదుర్రులో జరిగిన శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలకు శ్రీమావులేటి చిరంజీవిరాజుగారు, డా॥లంక శేషగిరిరావుగారు మొదలైన భక్తులు చాల ముందుగానే వచ్చారు. వారితోను, శ్రీపరశురామయ్యగారితోను శ్రీబాబు తత్త్వ విచారణతోనే ఎక్కువ భాగం గడిపారు. పూజలు ప్రారంభించిన తొలి రోజులలోనే శ్రీపరశురామయ్యగారికి సుస్తీ చేసింది. వారు గంగరాజు పాకలోనే ఉన్నారు. శ్రీబాబు, శేషగిరిరావుగారు మందులు యిచ్చారు. కాని గుణం కనిపించలేదు. ఏకాదశినాడు సుస్తీ బాగా తీవ్ర రూపం దాల్చింది. ద్వాదశినాడు పూజల ఆఖరిరోజు శ్రీబాబు పూజలో ఉండగా దగ్గరలోనే కూర్చుని ఉన్న రమణబాబుకు దేవతార్చన నుండి శబ్దాలు మాటిమాటికి వినిపించాయి. పూజానంతరము శ్రీబాబు విచారవదనులై ఉండటం కనిపిపించింది. శ్రీబాబు పరశురామయ్యగారికి తీర్థం యిచ్చారు. ఆ సాయంకాల పూజతో శ్రీబాబు శరన్నవరాత్రి దీక్ష పూర్తి అయింది. ఆరోజు శ్రీబాబు భోజనం చేయలేదు. ఎవరితోను మాట్లాడనూ లేదు.

ఆ రాత్రి శ్రీబాబు పరశురామయ్యగారి వద్దకు వెళ్ళి చాలాసేపు కూర్చున్నారు. పూజలకోసం వచ్చిన చుక్కమ్మగారి మేనకోడలు కాశీసరోజని, మేనల్లుడు ఆదినారాయణశాస్త్రి, రమణబాబు అందరూ యింట్లో పడుకుని ఉన్నారు. వాళ్ళకు పూజగదిలో నుంచి ఎవరో గబగబ నడుస్తున్నట్లు గజ్జల చప్పుళ్ళు, గంటలు వినబడటం మొదలు పెట్టాయి. వాళ్ళు భయపడి, గంగరాజు పాకవద్దకు పరుగెత్తుకొని వెళ్ళి శ్రీబాబుతో ఆ విషయం చెప్పారు. శ్రీబాబు

వాళ్ళను వెంటబెట్టుకుని యింటికి తీసుకుని వెళ్ళి, తాము అమ్మగదిలో కొంతసేపు ధ్యానం చేసుకుని బయటకు వచ్చారు. పిల్లలతో "యిక మీరు పడుకోండమ్మా! ఏమీ భయంలేదు. అటువంటి శబ్దాలు ఏవీ వినిపించవు"అని ధైర్యం చెప్పి పడుకోబెట్టి మళ్ళీ గంగరాజుపాకకు తిరిగి వెళ్ళారు.

పరశురామయ్యగారి వద్దకు వెళ్ళి వారి హృదయముపై చేయి నుంచి శ్రీబాబు "నాన్నగారూ! ఎలా ఉంది?" అని అడిగారు. "హాయిగా ప్రశాంతంగా ఉంది బాబూ! ఎటువంటి సంకల్పములూ లేకుండా మనస్సు నిర్మలంగా వుంది" అన్నారు పరశురామయ్యగారు. అలా అన్న కొద్ది క్షణాల తరువాత, అప్పటిదాకా చిరునవ్వుతో ఉన్న పరశురామయ్యగారు ఒక్కసారిగా చిట్లించి, మళ్ళీ పకపకా నవ్వేశారు.

"ఏమైంది నాన్నగారూ?" అని అడిగారు. "చూశారా! ఈ మాయ యొక్క భాడవాతనం? ఇంత నిర్మలంగా ఉన్న యీ మనస్సులో సాంబాలు బియ్యంతో వండిన అన్నము, గోంగూర పులుసుకూర జ్ఞాపకం వచ్చాయి. అందుకనే వ్యాసమహర్షి 'బలవాన్ యింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి' అన్నారు. "ఛీ! ఆ భడవాచేష్టలకు మనం వంత పాడటమా? దానిచోటులో దాన్ని ఉంచాలి. ఏదైనా, యీ సంకల్ప శేషం లేకుండా పోవాలి గనుక దొడ్లోవున్న గోంగూర మొక్క నుంచి ఒక ఆకు తీసుకురండి" అన్నారు. ఆ ఆకు తెప్పించి, ఒక చిన్న తుంపును ఒక క్షణం నోట్లో ఉంచుకుని దాన్ని తుపుక్కున ఉమ్మేసి, "హమ్మయ్య! ఇప్పుడు కర్మశేషము, సంకల్ప శేషము లేకుండా పోయాయి" అన్నారు పరశురామయ్యగారు.

"శ్రీరామాన్ని పిలిపించమంటారా?" అని అడిగారు శ్రీబాబు. "అక్కర్లేదు నాయనా! నా కెవరిమీద భ్రాంతి లేదు. వాళ్ళు నా కర్మపుత్రులు మాత్రమే. వాడీ సమయంలో నా దగ్గర ఉండి చేసేది కూడా ఏమీ లేదు. నా జ్ఞానపుత్రుడగు పరబ్రహ్మమూర్తివి నీవు యీ సమయంలో నా దగ్గర ఉండటం నా భాగ్యం. ఈ కళేబరాన్ని యిక్కడే విడిచేసి నీలో చేరిపోతున్నాను బాబూ!" అని తమ గుండెలపై ఉన్న శ్రీబాబు చేతిని అలాగే అదిమి పట్టుకుని శ్రీబాబు దృష్టిలో దృష్టి నిలిపారు పరశురామయ్యగారు. **తత్వమసి** అని శ్రీబాబు అన్నారు. **త్వమేవాహం** అంటూ కనులు మూసుకున్నారు పరశురామయ్యగారు. శ్రీబాబు కొద్ది క్షణాలు అలాగే ఉండి అశ్రుపూరిత నయనాలతో అక్కడి నుండి లేచి అమ్మపూజగదిలోకి వెళ్ళిపోయారు. ఆ తెల్లవారుజామునే స్వస్వరూప లయం పొందారు పరశురామయ్యగారు.

-సశేషం

# మధురాతి మధురం భగవన్నామం

– జి.వి

(సమర్థ సద్గురు శ్రీబాబూజీ మహరాజ్‌వారు, 1981 డిసెంబర్ 31 గురువారం నాడు, గుంటూరు బృందావన గార్డెన్స్‌లో జరిగిన సత్సంగ సమావేశంలో అందించిన దివ్య బోధామృతం)

"భగవన్నామం మధురాతి మధురమైనది. దాని రుచి మహత్తరమైనది. భగవానుడి దివ్య నామంలో మాధుర్యం, శక్తి అనుభవ పూర్వకంగా తెలుసుకోవలసినదే.

పరమేశ్వరుడి కమనీయ ఆకృతి అద్వితీయమైనది. ఆయన రూప దర్శనంతో సర్వేంద్రియాల తాపం చల్లారిపోతుంది. కాబట్టి ఆ మాధుర్యాన్ని చవిచూసినప్పుడే జిహ్వేంద్రియానికి సార్థకత. ఆ కమనీయ ఆకృతిని దర్శించినప్పుడే నయనేంద్రియాలకు సార్థకత.

మనస్సు పరమాత్మలో  లయించే కొద్దీ కర్మవాసనలు, దుష్ట సంకల్పాలు హరించిపోయి ప్రశాంతి సిద్ధిస్తుంది. అపరిమితమైన ఆనందం కలుగుతుంది. భగవన్నామ సంకీర్తనలో మనస్సు శుద్ధమవుతుంది. అప్పుడు దానిలో దాగి ఉన్న సత్పదార్థం గోచరమవుతుంది.

మానవుడు స్వతః ఆనంద స్వరూపుడు. కాని అజ్ఞానావరణ వలన, అహంకార మమకారాది దోషాల వలన అశాంతికి గురవుతున్నారు. పరమాత్మ ధ్యానం వలన జ్ఞానాగ్ని రగుల్కొని, అవిద్యారణ్యాన్ని దహించివేస్తుంది. అప్పుడు దుష్ట సంకల్పాలనే క్రూర మృగాలు కూడా నశిస్తాయి. సాటి మానవుణ్ణి మానవుడిగా ఆదరించలేకపోవటానికి ఆ లక్షణాలే కారణం.

భగవన్నామం అనే తీర్థం సేవించటం వలన మానవుడిలోని కాలుష్యం తొలగిపోయి, అగ్ని సంస్కారం పొందిన గోమయం పవిత్రమైన విభూతిగా పరిణమించినట్లు పరమహంస స్వరూపుడు అవుతాడు. అతడిలో జీవత్వం లోపించి, జగదీశ్వరత్వం నెలకొంటుంది. దివ్య జ్ఞాన సంపన్నుడై మోక్షాన్ని పొందుతాడు.

ధనుర్మాసంలో వ్రేపల్లెవాసులందరూ వాసుదేవులు అయినారు. కృష్ణ భగవానుడి వయస్సు అప్పుడు కేవలం 16మాసములు. (యేడాదిన్నర వయస్సు). అయితే నేమి? ఆ బాలకృష్ణుడే వారికి పరతత్వబోధ చేశాడు. 'ఓం కృష్ణ ఓం కృష్ణ కృష్ణాయ నమః' అని  తారక మంత్రాన్ని వారికి బోధించాడు. వ్రేపల్లెలో

ప్రతి యింట క్రిష్ణ తారక మంత్రం పరిపాటి అయింది. ఈ సంకీర్తనలో స్త్రీ పురుష భేదం కాని, మరొక వివక్షత కాని అడ్డురాలేదు. గోపికలు భావ సమాధి స్థితిని పొందారు. వారి కళ్ళలో కృష్ణ పరమాత్మ నిలిచాడు.

బాలకృష్ణుడి దివ్య తేజస్సు దైవికంగా, మానసికంగా గోప గోపీ జనంలో పరివర్తన కలిగించింది. వారి మనస్సు పంచదార పాకం వంటి కృష్ణ రసాయనంలో ఊరి ఊరి తదాత్మ్యరూపం దాల్చింది. చివరకు ఆత్మానుభూతి పొంది ధన్యజీవులైనారు.''

ప్రగాఢ విశ్వాసమే భక్తి యని శ్రీబాబు నొక్కి వక్కాణిస్తూ, మానవుడు వాసనారహితుడైనప్పుడే వాసుదేవ దర్శనం సిద్ధిస్తుంది అన్నారు. ప్రతి మానవుడు అలాంటి దివ్యానుభూతి పొందినప్పుడే జన్మ సార్థకం అవుతుంది అని ప్రబోధించారు. పరమాత్మకు ప్రతిరూపమైన సద్గురుదేవుని పాదపద్మాలను ఆశ్రయించినప్పుడు నీరు పల్లం వైపు సులభంగా మళ్ళినట్లు దివ్యజ్ఞాన ప్రవాహం వారి మనస్సును ముంచెత్తి అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది అని శ్రీబాబు పేర్కొన్నారు.

*

## అమృత బిందువులు

1. శృతి, లయ, తాళములు ఏకం చేసి పాడితే ఎంతో ఆనందంగా ఉంటుంది. అటులనే సత్వ రజస్తమో గుణములను ఏకం చేసి ప్రణవ నాదంతో లయింపజేస్తే ఎంతో హాయిగా ఉంటుంది.
2. తాబేలు నీటిలో ఉండే తన బిడ్డలను తలచుకోగానే ఆ బిడ్డలకు ఆహారం సమకూరును గదా మరి ఆ జగజ్జనని, ఆ కరుణామయికి మీ అవసరాలు తెలియవా?
3. సత్యం పలకాలంటే కొన్ని మాటలే చాలు.
4. భగవద్విచారణ కూడ తపస్సే.

– కాళీ బాబు

(గత సంచిక తరువాయి)

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

మానవ జీవితానికి గమ్యం దృఢ అపరోక్షానుభూతి. దానిని పొందటానికి రెండు మార్గాలు. 1. బహిరంగ సాధన. 2. అంతరంగ సాధన.

దానము, వ్రతాలు, పూజలు, పుణ్యకార్యాలు ద్వారా చేసే బహిరంగ సాధన అపరోక్షానుభూతిని పొందాలనే ఆకాంక్ష పెంపొందిస్తుంది.

అంతరంగ సాధనకి ఉపక్రమించటానికి సాధన చతుష్టయం సాధించాలి. వివేకము, వైరాగ్యము, శమదమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం ద్వారా సత్య పదార్థ శోధనకి మనస్సు ప్రయత్నిస్తుంది.

శ్రీసద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన దివ్య చరణారవిందముల యందు పరిపూర్ణ విశ్వాసముతో ఆయన చెప్పిన బోధా శ్రవణము, మననము, ద్వారా నిదిధ్యాసకి రావటమే అంతరంగ సాధన.

శాస్త్రాధ్యయనము, గ్రంథ పఠనము చేసి విచారణ చేస్తే అహంకార గ్రంధులు దృఢపడతాయి. సద్గురుమూర్తిని ఆశ్రయించి విచారణ చేస్తే అనుభూతి సుగమం అవుతుంది. సాధన సక్రమంగా జరుగుతున్నట్లు నీకే అవగత మవుతుంది. సరియైన మార్గంలో సాధన కొనసాగించే సాధకుడు ధ్యానము, జపము, పారాయణల యందు ఆరోగ్యము సరిగా లేకున్నా అనురక్తిని కలిగి ఉంటాడు.

శాస్త్రంలో మంత్రాలు ఉంటాయి. కాని రహస్యాలు, కీలకాలు వుండవు. అవి సద్గురుమూర్తి ద్వారానే పొంద గలుగుతారు. సద్గురు మూర్తిని ఆశ్రయించి ఏ కర్మ చేసినా అది నిష్కామ కర్మగా పరిగణింప బడుతుంది. గురు పుత్రుడు దానం చేసేటప్పుడు భగవంతుడు నాకు యీ సదవకాశాన్ని ప్రసాదించాడు అనే భావనతో చేస్తాడు. కాని సాధారణ మానవుడి భావం అలా ఉండదు. నేను ధనవంతుణ్ణి కాబట్టి దానం చేయగలుగుతున్నాను. దానం స్వీకరించేవాడు పేదవాడు అనే భావన కలుగుతుంది.

అపరోక్షానుభూతికి విచారణ చాలా అవసరం. విచారణతో కూడిన సాధన ఫలిస్తుంది. విచారణ ద్వారా చేసిన కర్మలన్ని రహితం అవుతాయి. పరంపరా సాధనలు ఎన్ని చేసినా సాక్షాత్ సాధనలు చేయాలి. వంట సామానులు పాత్రలు ఎన్ని ఉన్నా అగ్ని లేనిదే వంట చేయలేరు కదా! తత్త్వాన్ని గుర్తించటానికి

దృష్టాంతాల ద్వారా విచారణ చేయవచ్చు. కాని తత్త్వాన్ని పట్టుకుని దృష్టాంతాలని వదిలివేయాలి. దాహానికి గ్లాసుతో నీరు తెస్తే నీటిని స్వీకరించి గ్లాను వదిలివేస్తారు కదా! చీకటిగదిలో వస్తువుని గుర్తించటానికి ప్రకాశం కావాలి. అలాగే తత్త్వాన్వేషణకు విచారణ ఎంతో అవసరం.

విచారణ చేసే సాధకుడు 'నేను ఎవరు? జగత్తు ఎలా ఉంది? జగత్తుకి కర్త ఎవరు? ఉపాదానం ఏమిటి? అన్న అంశాలను పరిగణనలోనికి తీసుకుని విచారణ కొనసాగించాలి. మాతృగర్భంలో ఉన్న శిశువు భగవంతుడిని ప్రార్థిస్తూ, యీ గర్భ నరకాన్ని భరించలేకపోతున్నాను. నన్ను బయట పడవేయి. నీ స్మరణ మరువను' అంటాడు. బయటకు వచ్చేటప్పుడు నేనెవరు? అని ప్రశ్నించుకుంటాడు. బయటపడగానే చూట్టూ పరికించి 'నీవెవరు?' అంటాడు.

'నేనెవరు?' అనే విచారణ చేయాలి. పంచభూతాలు, జగత్తు నేనుకాదు. స్థూల సూక్ష్మ కారణ దేహాలు నేను కాదు. ఈ మూడింటికి సాక్షిని అని ఆరూఢంగా తెలుసుకోవాలి. జనన మరణాలు, ఆకలి దప్పికలు, శోకమోహాలు అనే షడూర్ములకు సాక్షిని అని దృఢంగా తెలుసుకోవాలి. పంచభూతాలకు, ఇంద్రియాలకు దేహానికి విలక్షణంగా ఉన్నాను అని ఆరూఢంగా గ్రహించాలి.

– సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులైన శ్రీమాగాపు అప్పారావుగారు 9-5-2012 బుధవారంనాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. గత కొద్ది నెలలుగా వీరు అస్వస్థతగా ఉంటున్నారు. వీరి వయస్సు 74సం॥లు. వీరికి భార్య, ముగ్గురు కుమారులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు కలరు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# నేను అర్థం చేసుకున్న జ్ఞానయోగం

(గత సంచిక తరువాయి)

–కొండ వెంకటరాజు

సత్వగుణ సంపన్నులు మరణానంతరం స్వర్గలోకం పొందుతారు. రజోగుణ సంపన్నులు మరణానంతరం తిరిగి జన్మకు వస్తారు. తమోగుణాలతో మరణించినట్లయితే పశుపక్ష్యాదుల జన్మలుగాని, లేదా హీనమైన మనుష్య జాతులందుగాని పుడతారు. ఈ మూడు తరగతులవారు మరణించిన తరువాత తిరిగి జన్మలను పొందుతారు. ఈ మూడు గుణాల నుండి యీ జన్మమందే ముక్తులైనవారు భగవంతునిలో లీనమవుతారు. వారికి తిరిగి జన్మ ఉండదు.

"ఎవడు నా యందు అచంచలమైన భక్తితో నన్నే కొలుస్తున్నాడో వాడు అనాయాసముగానే ఈ మూడు గుణాల నుండి యీ జన్మమునందే బంధ విముక్తుడై నన్నే పొందుతాడు'' అని భగవానుడు చెప్పుతున్నాడు.

జ్ఞానాన్ని వృద్ధి పరచుకునే వీలు ఒక్క సత్వ గుణానికే ఉంది. తమో గుణానికి ఆ శక్తి లేదు. కావున ముందుగా మనం ప్రయత్నం చేసి సత్వగుణాన్ని పెంచుకోవాలి.

- తమో గుణం యితరులను పీడించి వారి నుండి సేవలు అనుభవించాలని చూస్తుంది.
- రజోగుణం యితరులు సంతోషంగా అందించే సేవలతో సుఖించాలని చూస్తుంది.
- సత్వగుణం సేవించటమే పరమావధిగా ఉంటుంది.

శ్రీబాబూజీ మనకు అలవాటు చేసిన తేలికపాటి ప్రాథమిక గుణాలు మూడు. అవి మిత ఆహారం, మిత నిద్ర, మిత భాషణం. మనకు యీ గుణాలు బాగా వంట పట్టడానికి శ్రీమాతాజీ ఆశ్రమంలో ప్రతి యింటికి యీ మూడు గుణాలను స్టిక్కరు చేయించి అంటించారు. మన ఆశ్రమంలో సంవత్సరానికి ఒకసారి మౌనధ్యాన సప్తాహం జరుగుతుంది. ఈ సప్తాహంలో పాల్గొనే భక్తులు యీ మూడు గుణాలను చాలా జాగ్రత్తగా ఆచరణలో పెడుతున్నారు.

17వ అధ్యాయంలో భగవానుడు శ్రద్ధ, ఆహారము, యజ్ఞము, తపస్సు, దానముల గురించి వివరిస్తూ, సాత్విక రాజస తామస స్వభావాలు కలవారు ఎలా ఉంటారో చెబుతాడు. అలాగే 18వ అధ్యాయంలో సన్యాసము, త్యాగము

సాత్విక, రాజ, తామసములు అనునవి అనేగుణ భేదాలను బట్టి మూడు విధాలుగా వుంటాయి అని చెబుతూ జ్ఞానము, కర్మ, కర్త అనే వాటిని కూడా మూడు విధాలుగా సాంఖ్య శాస్త్రము వివరించింది. 3వ అధ్యాయం, కర్మయోగంలో కూడా యీ త్రిగుణాల గురించి చెప్పటం జరిగింది.

గీతాధ్యానము చేసిన ప్రతిసారిమనం గీతామహాత్మ్యం పారాయణ చేయవలసిన అవసరం ఉంది, కావున మహాత్యం గురించి కొద్దిగా తెలుసు కుందాము. ఎక్కడైతే గీతా పారాయణ జరుగుతోందో అక్కడ శ్రీ కృష్ణ పరమాత్ముడు గోపాలురు, గోపికలు, దేవతలు నారద మునీంద్రులతో సహా వచ్చి కొలువు ఉంటాడు. జ్ఞానప్రాప్తి, మోక్ష ప్రాప్తి లభిస్తూ ఉంటుంది. శ్రీ తారక పరబ్రహ్మ శాస్త్రిగారు ఒకసారి ప్రవచనంలో ***నారద*** అంటే జ్ఞానము అని చెబుతూ నారదుని తంపులమారితనం లోకకళ్యాణానికి దారితీస్తుందన్నారు.

. ఈ క్రింది పట్టికలో త్రిగుణాల కలయిక కలవారిని అయిదు విధాలుగా చూపించటం జరిగింది. దీనిని బట్టి మనం ఏ తరగతిలో ఉన్నామో చూసుకోవచ్చు. రజ స్తమో గుణాలను విడిచి సత్వ గుణాన్ని పెంచుకుని, చివరకు దానిని కూడా వదలి గుణరహితమైన వాడు జ్ఞానసంపన్నుడు అవుతాడు. హరిః ఓం తత్ సత్.

| తరగతి | గుణరహితం | సత్వగుణం | రజోగుణం | తమోగుణం | వివరణ |
|---|---|---|---|---|---|
| 1 | - | 10% | 20% | 70% | నోట్ 1 |
| 2 | - | 10% | 70% | 20% | నోట్ 2 |
| 3 | - | 70 % | 20% | 10% | నోట్ 3 |
| 4 | - | 90 % | 10% | 0 | నోట్ 4 |
| 5 | 100% | - | - | - | నోట్ 5 |

**నోట్సు –**

1. ఈ కోవకి చెందినవారు తమోగుణ ప్రధానులు.
2. వీరు రజోగుణ ప్రధానులు.
3. వీరు సత్వ గుణ ప్రధానులు. ఆధ్యాత్మికోన్నతి పొందినవారు.
4. వీరు మహాత్ములు. కేవలం సత్వగుణ సంపన్నులు.
5. జీవాత్మ, పరమాత్మల భేదాన్ని ఛేదించి పరమానందాన్ని అనుభవిస్తున్న యోగి పుంగవులు.

(గత సంచిక తరువాయి)

# తరణి

-సుశీలా ప్రసాద

"అప్పుడు మరొక వింత జరిగింది. విను! నువ్వలాగ నిద్రిస్తూనే ఉన్న సమయంలో కోపధారి అయిన పురుషుడొకడు కత్తి చేతబట్టి నీ దగ్గరకి వచ్చాడు. తన శత్రువు అనుకుని నిన్ను అంతం చేయాలని కత్తి ఎత్తేసరికి నేను వాని కళ్ళు తెరిపించాను. 'అయ్యో! పొరబడ్డానే. వీడెవడో నా విరోధి పోలికలున్నవాడు గాని వాడు కాదు. నయం పొడిచేశాను కాదు పాపం! బ్రతికి పోయాడు.' అనుకుంటూ వెనుతిరిగి పోయాడు. అలాగ నిన్ను మృత్యుముఖం నుంచి కాపాడాను. ఎందుకు? శాశ్వతమైన ఆనందం ఏది ఉందో అది నువ్వు నా వలన తెలుసుకుని అనుభవించి చిరంజీవివై నా పేరుప్రతిష్ఠలు నిలిపి లోకానికి ఆదర్శమూర్తివి కావాలని!" ప్రేమాభిమానాలతో నిండిన ఆ మాటలు వింటూ తరణి కళ్ళవెంట ఆనంద బాష్పాలు జాలువారసాగాయి. వాని మనస్సులోని సందేహ మేఘాలు విచ్చి పోయాయి.

"చూడు నాయనా! నీ నిద్ర కాపాడింది అన్నానే, అది ఎలా అంటే ఒళ్ళెరుగక పడుకున్న నీ శరీరం మీద నుంచి ఒక త్రాచుపాము పాకుతూ వెళ్ళిపోయింది. నువ్వప్పుడు గనుక మేలుకొని ఉంటే దాన్ని చూసి తప్పకుండా భయపడి అదిలించి ఉండేవాడివి. అది ఆత్మరక్షణ కోసం నిన్ను కాటేసి వుండేది. చిరునవ్వుతో చెబుతున్న గురుదేవులలో పసివాడిని ఒడిలో పొదువుకొని జోలపాట పాడి నిద్రపుచ్చే తల్లి కనబడింది తరణికి. తన ప్రాణ రక్షకుడైన దైవస్వరూపుని పాదాలు వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. కన్నీరే పన్నీరుగా అభిషేకం చేశాడు. "సర్వజ్ఞులు, సర్వేశ్వరులు, సర్వశక్తి సంపన్నులు, సర్వాంతర్యామి అయిన తమరు పరమానుగ్రహ స్వరూపులై నన్ను మీ దరికి చేర్చి మీ కృపకు పాత్రులను చేసారు. అజ్ఞానంతో నాలో కలిగిన సందేహాన్ని తీర్చి సమర్థులని నిరూపించి చూపారు. నాకు తరుణోపాయం చూపే భారం మీదే గురుదేవా!" అన్న తరణిని చూస్తూ గురుమూర్తి " గురు సూర్యునికి ఉదయాస్తమయాలు లేవు. అలా సార్థక నామధేయుడవై నువ్వు కూడా అఖండ జ్ఞాన ప్రకాశ స్వరూపుడివి కావాలి!" అన్నారు. "నువ్వు నావాడివి" గురుదేవుల అమోఘమైన వాణి తరణి హృదయాకాశంలో మార్మోమ్రోగింది. దృగ్దీక్షతో, హస్తమస్తక సంయోగంతో శిష్యునికి మోక్ష భవన ప్రవేశానికి కవాటాలను తెరిచే లక్ష్యార్థమనే తాళం చెవినిచ్చి "అక్కడ బ్రహ్మానంద వారధిలో ఓలలాడుతూ ఆ నీవు నేనైపో!" అన్నారు. ఓం శాంతిః శాంతిః

*

# శ్రీరామ నవమి

(గత సంచిక తరువాయి) – జిల్లేపల్లి

తమకు కలిగిన బాధా నివృత్తికే మానవుడు మోక్షాన్ని అపేక్షిస్తున్నాడు. కాని, తనకై మోక్షాన్ని కోరటం లేదు. మోక్షమన్నది మూల వస్తువు. అందుచేత మోక్షార్థి బ్రహ్మ జిజ్ఞాసి కావాలి. ఆత్మబుద్ధి ధర్మాధర్మ నిర్ణయానికి చాలనప్పుడు గురుబుద్ధిని ఆశ్రయించటమే మేలు. ధర్మ సమ్మూఢ చేతస్కుడగు అర్జునునికి శ్రీకృష్ణ భగవానుడు చివరిసారిగా బుద్ధి కుశలతపై ఆధారపడి యుండు విమర్శనాలోచనలను కట్టిపెట్టి, సంపూర్ణ భక్తివిశ్వాసాలతో తనను శరణుపొంది, తన ఆజ్ఞా పరిపాలనే కర్తవ్యంగా మెలగినచో అతని భారమంతయూ తానే వహించి సర్వ పాపముల నుండి విముక్తుణ్ణి చేస్తానని చెప్పాడు. పుణ్య పాప భారమంతా శ్రీకృష్ణునిపై మోపి ఆయన చెప్పిన విధంగా యుద్ధమొనర్చాడు. భీష్ముడిది గమనించి యుద్ధ భారమంత శ్రీకృష్ణునిపై ఉన్నదని, అందులకు కర్త కర్మ భోక్త భగవంతుడైన శ్రీకృష్ణుడేగాన పాండవులకే పాపమూ అంటదని భావించాడు.అలాగే సర్వ ధర్మాలూ త్రికరణ శుద్ధిగా నీదని సద్గురు పాదసేవలో శరణాగతి పొందితే వారి పాప పుణ్యములు, మంచి చెడ్డలు. ముక్తి శక్తులు గురుమూర్తి తానే వహించి కడతేర్చగలడు.తన హృదయమందే దేవుడున్నాడని గ్రహించినవారు, సాకారునిగానో, నిరాకారునిగానో భక్తి తత్వము వలన గుర్తించి భయభ్రాంతులను వదలి. జ్ఞానాన్ని సంపాదించి, తాము నిమిత్తమాత్రులమని గ్రహించి, తమలోని అహంకారమును దాటి శరణుజొచ్చినచో తరింపవచ్చును.

'ప్రేమతో నా వద్దకు రండి. మిమ్మల్ని నేను రక్షిస్తాను. త్రోవను చూపిస్తాను.' ఇహపరములు రెండిటికిని సార్థకం చూపుతాను అని భగవానుడు ఇచ్చిన హామీ వలన ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మికోన్నతి, నిత్యానిత్య వస్తు వివేకము, నిష్కామ కర్మాచరణము అత్యంతావశ్యకములు. భగవంతుడున్నాడా లేడా అని విచారణ కన్న ఉన్నాడనే విశ్వాసము, భక్తి ద్వారా కర్తృత్వ భోక్తృత్వములు తమ నుండి తొలగించుకుని, ఈశ్వరునిపైన, జ్ఞాన ప్రకృతిపైన ఆరోపిస్తూ, ప్రవర్తిస్తూ, సాధన ద్వారా పొందటం వలన మోక్షప్రాప్తి కలుగుతాయి.

దీనినే జ్ఞానులైన సద్గురు సమాశ్రయం వలన తెలుసుకుని, వివేకము కలిగి వైరాగ్యాచరణలో వ్యావహారికమందు గల జ్ఞానాన్ని గ్రహించి, నిష్కామ కర్మకు భక్తిపూరిత సత్కర్మ నిర్వహణకు కృషి చేసి తరించెదరు గాక! శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవరప్రసాద బాబూజీమహరాజ్‌వారు తమ శిష్యకోటికి అందించే ఆత్మారామ విచారణ పర్వము వలన లోకకళ్యాణ మేర్పడి శ్రీరామ నవమి జరగగలదు!!

*

# శ్రేయోభిలాషి శ్రీబాబు

- సుశీలా ప్రసాద

శ్రీబాబు దివ్య సన్నిధిలో ఆశ్రమంలో 1979వ సంవత్సరం కార్తీక మాసంలో నేను నాగదీక్ష చేస్తున్నాను. ఆ సమయంలో గర్భవతినై ఉన్న నన్ను గురించి శ్రీబాబు "సుశీల ఆశ్రమంలో ఉండి దీక్ష చెయ్యటం చాల మంచిది. మీ శ్రేయోభిలాషిని కనుక చెప్పాను'' అని 28-7-1979న ఉత్తరం వ్రాయిస్తూ 'సదా మీ శ్రేయోభిలాషి ' అని తమ దివ్య నామాక్షరాల సంతకంతో లేఖ ముగించారు. సద్గురుమూర్తి ఆజ్ఞ మేరకు నేను ఆశ్రమం చేరి మహదానందంగా పుట్ట దీక్ష చేస్తున్నానన్నమాట.

అప్పటికి శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మించలేదు. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో స్వయంభువై వెలసిన శ్రీరామలింగేశ్వరుడు శ్రీబాబు విజ్ఞానమందిరంలోనే వేంచేసి ఉండి భక్తుల అభిషేకాది అర్చనలు అందుకుంటున్నాడు. శివ ప్రీతికరమైన ఆ కార్తీక శుభ దినాలలో రోజూ అభిషేకాదులు జరుగుతూనే ఉండేవి. నేను అవన్నీ ఆనందంగా చూస్తూ శివకవచం, శివ సహస్రనామాలు యిత్యాది స్తోత్రాలన్నీ చదువుకుంటూ శ్రీసద్గురుమూర్తి నాకింతటి మహత్తర సదవకాశాన్ని ప్రసాదించినందుకు పొంగిపోయేదాన్ని. అలాంటి సమయంలో ఒకరోజు రాత్రి శ్రీబాబు కలలో దర్శనమిచ్చి 'మృత్యుంజయ మంత్రం రోజుకు 11సార్లు 18రోజులపాటు చెయ్యి'' అని చెప్పారు.

తెల్లవారగానే ఆ కలని మననం చేసుకుంటూ స్వామి చెప్పిన ప్రకారం చెయ్యటానికి ప్రయత్నం ప్రారంభించాను. మొదట యీ విషయం నేను హనుమాయమ్మ గారికి (గురువుగారు)కి చెప్పాను. ఆవిడ కొంచెం ఆలోచించి 'నువ్వు ఒక దీక్ష చేస్తున్నావు కదా! మళ్ళీ అందులో యింకో దీక్ష ఎలా చేస్తావమ్మా! ఇది కానీలే ముందు'' అన్నారు. ఈ సమాధానం నాకు తృప్తిని కలిగించలేదు. శ్రీబాబు ఆజ్ఞ నా మనస్సులో మెదలుతూ నన్ను వదలనందున నేను మరో ప్రయత్నంగా వెళ్ళి విశ్వనాథం మావయ్యతో చెప్పాను. విశ్వనాథం మావయ్య నా మాట విని 'అది నీకెందుకే చాంతాడంత పొడుగుంటుంది. బాగా చెయ్యగలిగినవాళ్ళే గంటకి 20 లేదా 25 సార్లకంటే ఎక్కువ చెయ్యలేరు. నువ్వేం చేస్తావు'' అనేసి ఆ మంత్రమేమిటో అసలు సూచన ప్రాయంగా కూడా చెప్పలేదు.

ఇది బాబు ఆజ్ఞ అని నేను ఆయనకు చెప్పలేదు. ఆ విషయం తెలియనందున ఆయన మామూలు సంగతేమోనని అభిప్రాయపడి ఉండచ్చులే అనుకొని మనస్సుకు నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తే నాకు తోచకుండా ఉంది. ఇది గురుమూర్తి ఆజ్ఞ. అలాగ మనస్సులో మధనపడుతూనే రెండు రోజులు గడిచాయి.

ఒక రోజు వడాలి పిన్నిగారి దగ్గరకు వెళ్ళాను. ఆవిడ మాటల్లో 'నువ్వు భాగవతం చదువుతూ ఉండు మంచిది' అన్నారు. అక్కడే ఉన్న కామేశ్వరక్క 'నీ కడుపులో ఉన్నవాడు భాగవతం వింటూ పరీక్షిత్తు పుట్టుకు వస్తాడులే' అన్నది నవ్వుతూ. నా కెందుకో ఆ మాట వింటూనే మనస్సు చివుక్కు మంది. పుట్టినప్పుడు పరీక్షిత్తుకు ప్రాణం లేదు. అయితే శ్రీకృష్ణపరమాత్ముడే పాండవుల వంశాకురమైన పసివానికి ప్రాణంపోసిన సంగతి ఆ క్షణమే గుర్తుకు రాగా, సాక్షాత్తు కృష్ణ స్వరూపులైన శ్రీబాబు దివ్యసన్నిధిలో ఉన్న నాకేమి భయం అనిపించింది. మాటల మధ్యలో అక్కడే బల్లమీద ఉన్న ఏదో కార్తీకమాస మహాత్మ్యం పుస్తకం తీసి చూశాను. కొన్ని పేజీలు త్రిప్పగానే నా కన్నులకెదురుగా నాకు సాక్షాత్కరించింది మృత్యుంజయ జప మహామంత్రం! ఇక నా ఆనందానికి అవధులులేవు. నా గురుదేవులే నాకు మార్గం చూపారు. ఇక ఆ మంత్రం గుర్తుపెట్టుకొని త్వరత్వరగా యిల్లు చేరాను.

స్వామి చెప్పినట్లుగానే రోజుకి 11సార్లు చొప్పున 18రోజులు జపం పూర్తి చేశాను. కార్తీక సోమవారంనాడు స్వామికి ప్రీతికరమైన తుమ్మి, జిల్లేడు, ఉమ్మెత్త పూవులతో పూజ చేసుకున్నాను. బాబు ఆజ్ఞ పాటించి ధన్యురాలను అయ్యాను అనిపించింది.

నెలలు నిండి ప్రసవ సమయం వచ్చి సిజేరియన్ ఆపరేషన్ అవసరమైంది. నా గురుదేవులే నాకు అండగా నిలబడ్డారు. దేహస్మృతి లేకపోవటం వలన శరీర బాధ తెలవలేదు. పుట్టిన పాప పరిస్థితికూడా బాగా లేదన్నారు. అదీ తెలియలేదు నాకు. నాకు తెలిసినదల్లా ఒక్క నా కన్నులకెదురుగా ఉన్న తెల్లని వస్త్రాలతో, భిక్షాపాత్ర ధరించి నా చూపులో చూపు నిలిపి నన్నే చూస్తూ నిలిచిన పరమేశ్వరుని దివ్యమంగళ విగ్రహం! మూడవ రోజు తెలివి వచ్చిందన్నారు మావాళ్ళు. పసిది నేను సుఖంగా వున్నాం. ఏ మాత్రం అలసట బాధ తెలియలేదు నాకు.

'తల్లినీ పిల్లనీ యిద్దరినీ క్షేమంగా యింటికి పంపించండి' అని సర్జన్ లలితకుమారిని ఆజ్ఞాపించిన సద్గురుమూర్తి, 'తల్లీ పిల్ల యిద్దరూ లేనట్లే' అని డాక్టర్లు పెదవి విరిచారని విని "అలాగ జరగటానికి వీలులేదు. నన్ను నమ్ముకున్న జీవులు వాళ్ళు. మేము చక్రం అడ్డువేశాము'' అన్నారని ఆత్మీయులైన ఆశ్రమవాసులు ఆనందంతో చెప్పినప్పుడు, 'నమ్మినవారి సొమ్ము అయి నిలుస్తాడు దయానిధి అయిన పరమాత్ముడు. ఇందుకు నా జీవితమే నిదర్శనం సుమా!' అని సమాధానం చెప్పాను. 'ఈశ్వర స్వరూపంగా సద్గురుమూర్తి నిలబడ్డాడని తెలుసుకుందా సుశీల' అన్న శ్రేయోభిలాషి శ్రీబాబు కృపా విశేషాన్ని ఎంత వర్ణించగలను!!

# విష్ణు కథలు

(గత సంచిక తరువాయి)

–రమణ ప్రసాద్

## 3.తులసీదాసు



మన్మథతాపము ఓర్వలేని తులసీదాసు ఇంటిచుట్టూ తిరిగి మేడపైన కిటికీతీసి వుండటం గమనించాడు. భగవంతుడు ఒక సర్పరూపం ధరించి కిటికీనుండి వేలాడుతున్నాడు. తులసీదాసు దానిని తాడు అని భ్రమించి మెల్లగా మేడమీదకు ఎక్కి లోపల ఉన్న వారిని తొక్కుచు 'నాప్రాణ నాయకీ! ఎక్కడ ఉన్నావు' అని బిగ్గరగా అరుస్తుంటే మమతాదేవి వులికిపడిలేచి దీపము వెలిగించి, భర్త వద్దకు వచ్చి అతని పాదములకు నమస్కరించింది. తులసీదాసు పరమానందముతో అత్తమామలు, బంధువులు చూస్తున్నారన్నది గమనించకుండ ఆమెని బిగియార కౌగలించుకొని "నన్ను అక్కడ వదిలి ఇక్కడకు వచ్చేశావా, నామీద కోపమా నిన్ను ఎడబాసి క్షణమైనా ఉండలేను" అన్నాడు.

మమతాదేవి మంచి మాటలతో అతనిని ఉపశమింపచేసి ""ఇంత రాత్రి ఎలా వచ్చారు?" అని అడిగింది. తాను పాదుషా వద్దనుండి బయలుదేరి దుంగ సహాయముతో నదిని దాటి త్రాటిని పట్టుకొని పైకి వచ్చానని చెప్పగా ఆమె కిటికీ నుంచి చూడగా ఒక చనిపోయిన సర్పము వ్రేలాడటం గమనించింది.

"ఆహా! ఎంత సాహసం చేశారు? అందరూ చూస్తుండగా రతిని కోరటానికి కారణం నామీద మోహమేకదా!కామమనెడి మదగజం జ్ఞానమనే అంకుశంతో వశపడవలసిందే కాని ఇతరులకు లోబడదు. కామంవల్లే కదా రాక్షసులు కష్టపడి సంపాదించిన అమృతాన్ని కోల్పోయింది? కామంచేతనే కదా విశ్వామిత్రుడు తన తపోశక్తిని ధారపోసినది. కామం వల్లనే ఇంద్రుడు తన దేహాన్ని చెడగొట్టుకొన్నది. కామంవల్లనే కదా రావణుడు సర్వనాశనమైనది? కామాన్ని

మించిన బంధంగాని, రోగంకాని లేదు. నాయందుగల వాంఛను మీరు ఆ పరాత్పరుడైన శ్రీరామచంద్రుని పై ఉంచితే ఎంత బాగుండేది? ఆయన అపార కరుణచేత శాశ్వతానందమే లభిస్తుంది కదా? అటువంటి బ్రహ్మానందాన్ని కాదని తుచ్ఛమైన ఈ దేహాన్ని కోరటం మీకు తగునా"అని అనేక విధములుగా నచ్చచెప్పింది.

***తులసీదాసు విరక్తితో భగవదన్వేషణకై కాశీకి పోవుట.***

తులసీదాసు భార్య మాటలను విని విరక్తిని పొంది తను ఇంతకాలం వ్యర్థము చేసినందుకు చింతించి భక్తితో తన హృదయకమలమందు రామమూర్తి పదకమలాలను నిలుపుకొని మమతాదేవికి ప్రదక్షిణము చేసి నమస్కరించి "నీ అనుగ్రహంచేత మోహపాశంనుండి విముక్తి పొందాను. శెలవు" అని బయల్దేరాడు.

అలా నడుస్తూ ఒక అడవిలోకి ప్రవేశించి తెల్లవారేసరికి ఒక కొండ ఎక్కి కొంతసేపు రామనామ స్మరణ చేసుకొని తిరిగి నడుస్తూ "నాకు రామమూర్తి సందర్శనము లభిస్తుందా? ఆయన నన్ను అనుగ్రహిస్తాడా?" అని చింతిస్తూ అడవిలోని రామాలయంలో ప్రవేశించాడు. శ్రీరామ విగ్రహానికి భక్తి పూర్వకంగా నమస్కరించి "రామా! నీ దర్శనం కోసమే నిన్ను వెదుకుతూ తిరుగుతున్నాను. కానీ నీజాడ తెలియలేదు. అడుగులు పగిలి రక్తం వస్తొంది. ఆయాసమెక్కువగా ఉన్నది. నామొర ఆలకింపకున్నావు. నన్ను అపేక్షించుట ధర్మము కాదు" అని ప్రార్థించాడు. ఆ రాత్రి అక్కడే విశ్రమించి మర్నాడు ప్రయాణం సాగించాడు.

మమతాదేవి తన భర్తను విరక్తునిచేసిన తన అవివేకానికి చింతిస్తూ మగడు పోయిన మార్గమున పయనించుటకు సిద్దమయింది. బంధువులు ఆమెను వారించి నీ భర్తను మేము వెతికి తీసుకొని వస్తాము అని సమాధానపరిచారు. మమతాదేవి తన భర్త వర్తమానాన్ని తన అత్తకు తెలియచేసింది. రత్నాబాయి ఏడుస్తూ తన వియ్యంకుల ఇల్లు చేరింది.

ఉత్తరదిశగా వెళ్ళిన మనుషులు కాశీకి చేరి అక్కడ పిచ్చివాడల్లే తిరుగుతున్న తులసీదాసుని ఇంటికి రమ్మని ప్రార్థించి అతడు రానని నిరాకరించడంతో వారు వెనుకకు మరలిపోయి ఈ విషయం తెలిపారు.

రత్నాబాయి తన కోడలిని తీసుకొని కొందరు భటులతో కాశీకి చేరి అక్కడ వెదకుతూ రామనామం చేస్తున్న కొడుకును చూసి. 'ఇంటికి తిరిగి వెళ్దాం ,అక్కడ నీ ఇష్టానుసారంగా హరిని స్మరించవచ్చు' అని చెప్పింది.

మమతాదేవి భక్తితో భర్తకు నమస్కరించి "దాసురాలి నేరమును క్షమించి

గ్రామమునకు తిరిగి రండి. నావలనే మీకు ఇన్ని కష్టాలు వచ్చాయి. మీ శరీరము శల్యావశిష్టమైంది. చూచినవారు పిచ్చివాడు అని నవ్వుతున్నారు" అని బిగ్గరగా ఏడ్చింది. తులసీదాసు "నీ ఉపదేశము అమోఘము, కానీ రాముని దర్శనము ఇంతవరకూ కాలేదు" అని పలికి శ్రీరాముని ధ్యానం చేస్తూ వెళ్ళిపోయాడు.

మమతాదేవి అత్తగారితో "మీ అబ్బాయిని మన గ్రామానికి తీసుకు వెళ్లలేము ఇక్కడే ఒక మఠం కట్టించి సాధువులకు సేవ చేస్తూ ఇక్కడే ఉందాము" అంది. రత్నాబాయి "అలాగే చేద్దాం నేను మాత్రం వెళ్ళి మీ మామగారిని ఇక్కడికి తీసుకు వస్తాను" అని చెప్పి నైమిశారణ్యంలో తన భర్త ఉన్న పర్ణశాల వద్దకు వెళ్ళి ఆయన పాదాలపై పడి విలపించింది. జరిగినదంతా విని ఆత్మారాముడు సంతోషించి "ఎంత మంచి వార్త విన్నాను! తులసీదాసు వైరాగ్యసంపన్ను డయ్యాడా? భగవంతుడు అనుగ్రహించాడు. వాడిని నేను చూడాలి అని కాశీకి వచ్చి తులసీదాసును చూసి సంతోషించి" భగవంతుని అనుగ్రహం మనపై సంపూర్ణంగా ఉంది. శ్రీ రామమూర్తి నిన్ను అనుగ్రహించుగాక. నీకు బ్రహ్మానందము సిద్ధించుగాక" అని దీవించి పరమపదించాడు. భర్త వియోగము సహించలేక తానును ప్రాణత్యాగము చేయతలచి కుమారుని కౌగలించుకొని "శ్రీ రామచంద్రుడు త్వరలో ప్రసన్నుడై నిన్ను అనుగ్రహించుగాక" అని ఆశీర్వదించి, భక్తి పూర్వకంగా భర్తను స్మరించు కొనుచూ గంగానదిలో దూకి ప్రాణత్యాగము చేసింది. తన తల్లిదండ్రులకు పరమపదము సిద్ధించటానికి నా తపస్సును ధారపోస్తాను అని సంకల్పించి గంగానదిలో నీరు చేతిలో తీసుకొనగా గంగాదేవి ప్రత్యక్షమై " నీవు ఇంకా 12 సంవత్సరాలు తపస్సు చేస్తేగాని వారికి పరలోక ప్రాప్తి కలగదు" అని చెప్పింది.

అంత తులసీదాసు భగవద్దర్శనముకై వ్యాకులత చెందాడు. మమతాదేవి స్వగ్రామము నుండి ఆస్తినంతా తెచ్చి ఒక మఠం కట్టించి సాధు సత్కారము చేస్తూ భర్తకు ఉపచారంచేస్తూ కాలం గడుపుతోంది.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL